

మెగా.. పచ్చి దగా..!



- నిరుద్యోగులతో ప్రభుత్వం చెలగాటం
- ఖాళీలు 20 వేలకు పైనే..
- నోటిఫికేషన్ 6100 పోస్టులకే..
- డీఎస్సీ ప్రకటన.. ఓట్ల స్టంటే అంటున్న నిరుద్యోగులు
- ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం



జిరాక్స్ సెంటర్ నడుపుకుంటున్నా..



2015లో బీఈడీ కోర్సు పూర్తయింది. తెలుగుదేశం ప్రభుత్వం ఉన్న సమయంలో ఒకసారి డీఎస్సీ పరీక్షకు హాజరయ్యాను. అయితే మార్కులు రాక ఉద్యోగం రాలేదు. వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ పడుతుందని ఎంతో ఆశగా ఎదురు చూశాను. కుటుంబ పోషణ కోసం జిరాక్స్ సెంటర్ నడుపుకుంటున్నాను. ఇప్పుడు హడావుడిగా ఎన్నికల ముందు నోటిఫికేషన్ విడుదల చేశారు. నిరుద్యోగులకు ఎంతమాత్రం ఉపయోగం ఉండదు.

- గిద్దలూరు బాలసుబ్రమణ్యం, రాజంపేట

ఎస్జీటీ పోస్టులకు అర్హత కల్పించాలి..



రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం ప్రకటిస్తున్న డీఎస్సీలో బీఈడీ చేసిన వారికి ఎస్జీటీ పోస్టుల్లో అవకాశం కల్పించాలి. బీఈడీ చేసిన వాళ్లు అర్హులుగా లేకపోవడంతో నిరుద్యోగ యువకులు ఎక్కువయ్యారు. ఉద్యోగ ప్రకటనలో ఎస్జీటీ పోస్టులు ఎక్కువగా ఉంటున్నాయి. స్కూల్ అసిస్టెంటు పోస్టులు చాలా తక్కువగా ఉంటున్నాయి. దీంతో బీఈడీ చేసిన వాళ్లు గతంలో పోస్టులు లేక.. ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించినా రాయలేని పరిస్థితి ఉంది. చాలామంది నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో వేలాది రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు.

- శేషాద్రి, గుర్రంకొండ

మెగా డీఎస్సీ మాటిచ్చారు..



రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని పాదయాత్ర సమయంలో సీఎం జగన్ మాటిచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు సంవత్సరాలు అవుతోంది. ఈ మధ్యలో ఒకసారి కూడా డీఎస్సీ వేయలేదు. తీరా ఎన్నికల ముందు అరకొర పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఈ నిర్ణయం చాలా బాధగా ఉంది. ఎందరో బీఈడీ, టీటీసీ పూర్తి చేసి ఉద్యోగాలు రాక. దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం పునరాలోచించి పోస్టుల సంఖ్యను పెంచి న్యాయం చేయాలి.

- మహ్మద్‌ఖాసీం, కలికిరి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి రాగానే ప్రతిఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి మెగా డీఎస్సీ ద్వారా.. వేలాది ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని పాదయాత్ర సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ హామీలను అమాయకంగా నమ్మిన నిరుద్యోగులు జగన్‌కు ఓటు వేశారు. తాము అనుకున్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాబట్టి ఇక తమ ఆశలు నెరవేరి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చేస్తాయని పగటి కలలు కన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిందే కానీ.. నిరుద్యోగుల గురించి పట్టించుకున్న పాపానపోలేదు. ఐదు సంవత్సరాలలో కనీసం ఒకసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది బీఈడీ, టీటీసీ పూర్తి చేసిన నిరుద్యోగులు ఎప్పుడెప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందా? అని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఉన్నత చదువులు చదివినా.. కుటుంబ పోషణ కోసం ఏదో ఒక చిన్నాచితక ఉద్యోగం చేస్తూ.. డీఎస్సీ కోసం చూస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే డీఎస్సీ ఉంటుందని ప్రకటించింది. అయితే అందులో ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగ ఖాళీలను చూడగానే నిరుద్యోగుల గుండెలు జారిపోయాయి. అనధికార లెక్కల ప్రకారం సుమారు రాష్ట్రంలో 20 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. అయితే ప్రభుత్వం కేవలం 6100 పోస్టులకు మాత్రమే ప్రకటన విడుదల చేయనున్నట్లు తెలిపింది. దీనిపై నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు నోటిఫికేషన్ కేవలం ఓట్ల కోసం స్టంటే.. అని బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈ ప్రభుత్వంలో డీఎస్సీ జరిగినప్పటికి, ఉద్యోగాలు వచ్చినప్పటికి అని నిర్వేదంగా ఉన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో ఎస్జీటీ పోస్టులు 36, స్కూల్ అసిస్టెంటు 102, లాంగ్వేజి పండిట్ 7, పీఈటీ 21, మ్యూజిక్ 5 పోస్టులు కలిపి 171 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎస్జీటీ 2, స్కూల్ అసిస్టెంట్ 154, లాంగ్వేజ్ పండిట్ 43, పీఈటీ పోస్టులు 42, మ్యూజిక్ 6 కలిపి మొత్తం 247 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

ప్రభుత్వ ఉద్యోగంపై ఆశ వదులుకున్నా..



ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం చేయాలన్నది నా కల. నేను 2018లో బీఈడీ పూర్తి చేశాను. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్, డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తానంటే..నమ్మి నా కుటుంబంతో సహా ఓటు వేశాం. చివరికి అధికారంలోకి రాగానే.. నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను నట్టేట ముంచారు. ఇప్పుడు వదలినా.. తక్కువ పోస్టులు ఉండడంతో.. ఉద్యోగంపై ఆశలు వదులుకున్నాం.

- సుజాత, రైల్వేకోడూరు

మెగా డీఎస్సీ అని ఎన్నికల డీఎస్సీ వదిలారు..



ముఖ్యమంత్రి జగన్ పదవిలోకి రాక మునుపు.. ప్రతి ఏటా జనవరికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. అందులో డీఎస్సీ కూడా ఉంటుందన్నారు. నాలుగేళ్లుగా దాని పేరు ఎత్తకుండా.. ఇప్పుడు ఎన్నికల ముందు డీఎస్సీ అంటూ హడావుడి చేస్తున్నారు. దాదాపు 20 వేలకు పైగా ఖాళీలు ఉండగా.. కేవల 6100 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తారట. ఇప్పటికీ టెట్ విషయంలో క్లారిటీ లేదు. గతంలో కూడా టెట్ పరీక్ష దాదాపు నాలుగు లక్షల మంది రాశారు. దీని ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చిందే తప్ప నిరుద్యోగులకు టీచర్ ఉద్యోగాలు వచ్చింది ఏమీ లేదు. ఇది కూడా ఎన్నికల స్టంట్ కాకుండా ఉంటే మంచిది.

- విరూపాక్షి లోకేశ్, పీటీఎం

తొమ్మిదేళ్లుగా డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్నా..



9 సంవత్సరాలుగా డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్నా.. మంత్రివర్గ సమావేశంలో.. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 6100 పోస్టుల కోసం మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ప్రకటన వచ్చింది. అయితే ఐదేళ్లుగా ఒక ప్రకటన కూడా లేనందువల్ల ఒకేసారి 20 వేల నుంచి 25 వేలకు ప్రకటన వస్తుందనుకున్నాం. అయితే అతి తక్కువ పోస్టులకు నోటిఫికేషన్ రావడం.. నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేసింది.

- కె.సురేంద్రబాబు, గాలివీడు

ఓట్ల కోసం డీఎస్సీ..



ఎంపీఈడి పూర్తి చేశా. డీఎస్సీ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నా.. ఐదు సంవత్సరాలలో ప్రభుత్వం ఒకసారి కూడా నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ప్రైవేటు స్కూల్‌లో పని చేస్తున్నా.. ఇప్పుడు డీఎస్సీ వదిలినా.. ఉద్యోగం వస్తుందనే నమ్మకం లేదు. కేవలం ఎన్నికలు సమీపిస్తుండడంతో.. ఓట్ల కోసం మాత్రమే ముఖ్యమంత్రి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారని అనుకుంటున్నా..

- నాగార్జున, సుండుపల్లె

రెండు పోస్టులకు వేలాది మంది...



ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో కేవలం రెండు ఎస్జీటీ పోస్టులు మాత్రమే ఖాళీ చూపిస్తున్నారు. టీటీసీ, బీఈడీ చేసిన నిరుద్యోగులు వేలాదిమంది ఉన్నారు. టెట్ క్వాలిఫైయింగ్ కోచింగ్ కోసం ఒక్కొక్కరికి రూ.15 వేల నుంచి రూ.20 వేలు ఖర్చు చేశారు. ఇప్పుడు చూస్తే ఎస్జీటీ పోస్టులు 2, 1504 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మాత్రమే చిత్తూరు జిల్లాలో చూపిస్తున్నారు. దీనివల్ల నిరుద్యోగులకు ఒరిగేదేమీ లేదు.

- కె.జగదాంబ, మదనపల్లె

అనుమతులు లేకుండానే ఆస్పత్రుల నిర్వహణ

- రోగుల నుంచి అధిక ఫీజు వసూళ్లు
- జిల్లా వైద్యశాఖ అధికారుల తనిఖీలో గుట్టు రట్టు



ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఈఎంవో దేవ శిరోమణి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 1: రోగుల ప్రాణాలకే విలువలు కట్టి మదనపల్లెలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు దోపిడీ పర్వం మొదలుపెట్టాయి. అసలు వైద్యశాఖ అనుమతులు (రిజిస్ట్రేషన్) లేకుండానే ఐదంతస్థుల భవనాలు, కార్పొరేట్ తరహాలో బిల్డప్‌లు ఇస్తూ రోగులను ఆకర్షిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం కాకుండా ప్రాణాల మీదికి వచ్చిన రోగులను భయపెట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఈ దోపిడీ ఉదంతం గురువారం మదనపల్లెలో డీఈఎంవో అధికారిణి దేవ శిరోమణి తనిఖీలో మూడు ప్రైవేటు ఆస్పత్రుల గుట్టు రట్టు అయింది. మదనపల్లెలో ప్రైవేటు ఆస్పత్రుల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఆధ్వర్యంలో మదనపల్లె సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. దీంతో పాటు రాయచోటిలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం డీఈఎంవో దేవ శిరోమణి తమ సిబ్బందితో మదనపల్లెలో మూడు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేశారు. అధికారుల తనిఖీలో విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయి. ఈ సందర్భంగా దేవ శిరోమణి మాట్లాడుతూ బహుజన యువసేన ఫిర్యాదు మేరకు తాము ప్రవీణ్ న్యూరో ఆస్పత్రి, రెయిన్‌బో ఆస్పత్రి, ఆధ్య కిడ్నీ ఆస్పత్రులను తనిఖీ చేశామన్నారు. ఇందులో ప్రవీణ్ న్యూరో ఆస్పత్రి, రెయిన్‌బో ఆస్పత్రికి వైద్యశాఖ రిజిస్ట్రేషన్‌లు లేవని తేలిందన్నారు. ఒకటిన్నర సంవత్సరం నుంచి ఈ రెండు ఆస్పత్రులు నిబంధనలు అతిక్రమించి నిర్వహిస్తున్నారన్నారు. అలాగే ఆధ్య కిడ్నీ ఆస్పత్రిలో ఫీజుల ధరల పట్టిక లేదని, అక్కడ ధరల పట్టిక బోర్డు పెట్టాలని సూచించామన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ఈ మూడు ఆస్పత్రులపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు ప్రైవేటు ఆస్పత్రులను మూసివేయించాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు


- షోకాజ్ నోటీసులో ఆంధ్రజ్యోతి వార్తా కథనం ప్రస్తావన
- ఇప్పటి వరకు 62 మృతుల ఓట్లు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ములకలచెరువు, ఫిబ్రవరి 1: ఓటర్ల జాబితాలో తప్పులు ఉండటంపై ములకలచెరువు పంచాయతీ కార్యదర్శి, ములకలచెరువు 17వ పోలింగ్ కేంద్రం బీఎల్వోగా విధులు నిర్వర్తిస్తున్న ఇబ్రహీంకు తహసీల్దార్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. గత నెల 26వ తేదీ ఆంధ్రజ్యోతి పత్రికలో ఓటర్ల తుది జాబితాపై 'అదే నిర్లక్ష్యం...అవే తప్పులు' అన్న కథనం ప్రచురితమైంది. ఓటర్ల జాబితాలో తప్పులు, మృతుల ఓట్ల తొలగింపుపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో పోలింగ్ కేంద్రాల్లో పలుమార్లు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. అయినా ములకలచెరువులోని 17వ పోలింగ్ కేంద్రంలో 9 మంది చనిపోయిన ఓటర్ల పేర్లు తొలగించలేదు. దీనిపై పోలింగ్ కేంద్రం బీఎల్వో అయిన పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం ఎన్నికల విధుల్లో అలసత్వం వహించారని తహసీల్దార్, సహాయ ఓటర్ల అధికారి శ్రీనివాసులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా రాతపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని, లేదంటే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు క్రమశిక్షణా చర్యల నిమిత్తం నివేదిక సమర్పిస్తామని నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం పంచాయతీ కార్యదర్శి తహసీల్దార్‌కు రాతపూర్వకంగా సంజాయిషీ రాసిచ్చారు. మృతి చెందిన ఓటర్లను తొలగించాలని అన్ని పోలింగ్ కేంద్రాల బీఎల్వోలకు తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు మండలంలో 62 మంది మృతి చెందిన వారి ఓట్లను తొలగించినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

రివర్షన్ ఇచ్చారు.. రద్దు చేశారు..!

- మధ్యలో చేతులు మారుతున్న డబ్బెంత?
- చర్చనీయాంశంగా మదనపల్లె ఆర్డీవో వ్యవహారం



రాష్ట్ర రెవెన్యూ మంత్రికి అప్పీల్ చేసుకున్న ఆర్డీవో మురళి

రాయచోటి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలు ఆర్డీవోగా విధులు నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడ్డాడనే ఆరోపణలపై మదనపల్లె ఆర్డీవో ఎం.ఎస్.మురళిని తహసీల్దార్‌గా రివర్షన్ ఇచ్చింది రాష్ట్ర ప్రభుత్వమే. అదే ఆ రివర్షన్‌నూ రద్దు చేస్తోందీ రాష్ట్ర ప్రభుత్వమే. ఈ రివర్షన్ రివర్స్ వెనుక ఎంత పెద్దమొత్తంలో డబ్బు చేతులు మారిందనే విషయమే ప్రస్తుతం జిల్లాలో రెవెన్యూ, రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తహసీల్దార్‌గా రివర్షన్ ఉత్తర్వుల తర్వాత సెలవులో వెళ్లిన ఆర్డీవో ఇంతవరకు తన చేత అన్నమయ్య జిల్లాలో సైతం అడ్డమైన పనులు చేయించుకున్న పెద్ద తలలను పట్టుకుని తనకు పడ్డ శిక్షను తప్పింకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు జిల్లా రెవెన్యూ శాఖలో హాట్‌టాపిక్‌గా మారాయి.

మదనపల్లె ఆర్డీవో మురళి 2013 మధ్య కాలంలో ప్రకాశం జిల్లా ఒంగోలు ఆర్డీవోగా పనిచేశారు. ఆ సమయంలో సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు-344లో 66.25 ఎకరాల ఈనాం భూమిని ఫేర్‌ల్యాండ్ రిజిస్టర్ (ఎఫ్ఎల్ఆర్) ప్రకారం ఒంగోలు చారిటబుల్ సదావర్తిమఠం ట్రస్టీస్ పేరు మీదున్న ఈ భూములను వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ 2013లో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల వెనుక పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందనే ఆరోపణలు వచ్చాయి. దీంతో 2016లో అప్పటి ప్రకాశం జిల్లా కలెక్టర్ ఈ ఆరోపణలపై నిగ్గు తేల్చమని జాయింట్ కలెక్టర్‌ను శాఖాపరమైన విచారణ కోసం విచారణాధికారిగా నియమించారు. నిబంధనలకు విరుద్ధంగా మఠం భూములను వ్యవసాయేతర భూమిగా మార్పు చేసినట్లు ఈ విచారణలో తేలింది. దీంతో రెవెన్యూ (విజిలెన్స్-1) డిపార్ట్‌మెంట్ వారి ఉత్తర్వులు జీవోఆర్.టి.నెంబరు-46, తేదీ-17-1-24 ప్రకారం ప్రస్తుతం మదనపల్లె ఆర్డీవోగా పనిచేస్తున్న ఎం.ఎస్.మురళిని తహసీల్దార్‌గా రివర్షన్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద్‌రావుకు ఆర్డీవో మురళి అప్పీల్ చేసుకున్నారు. తనపై ఇచ్చిన రివర్షన్ ఉత్తర్వులను రద్దు చేయాలని అప్పీల్‌లో కోరారు.

రంగంలోకి పెద్దతలలు

రివర్షన్ గండం నుంచి తనను కాపాడమని ఆర్డీవో కొందరు పెద్దతలలను శరణు కోరినట్లు సమాచారం. రివర్షన్ ఉత్తర్వులు వచ్చినప్పటికీ అవి బయటకు రాకుండా ఆ ఆర్డీవో తన పలుకుబడి ఉపయోగించి తొక్కిపెట్టినట్లు తెలిసింది. అయితే ఆంధ్రజ్యోతిలో ఈ విషయం వెలుగులోకి రావడంతో ఆయన సెలవుపై వెళ్లారు. సెలవులోకి వెళ్లి తనకు పడ్డ తహసీల్దార్‌గా రివర్షన్ శిక్షను తప్పించుకునేందుకు ఆర్డీవో ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆర్డీవో మురళిపైన విధించిన రివర్షన్ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపేసినట్లు సమాచారం. దీని వెనుక పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారిందనే పుకార్లు ఉన్నాయి. ఆర్డీవో రివర్షన్ వార్త ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చినరోజే పలువురు రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ అయ్యో.. మీరు ఎందుకు ఇంత కష్టపడి రాశారు. ఆయకేమీ కాదు, ఆయన వెనుక పెద్ద పెద్ద వాళ్లు ఉన్నారు.. ఈ ఉత్తర్వులు వారం రోజుల్లో వెనక్కి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు అచ్చం అలాగే జరిగింది. దీనిని బట్టి చూస్తే ఆర్డీవో వెనుక చాలా పెద్ద వ్యక్తులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే అన్నమయ్య జిల్లాలో సైతం ఈ ఆర్డీవో తన వెనుక పెద్ద తలలు ఉన్నారనే ధైర్యంతో పలు అడ్డదిడ్డమైన పనులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పలు ఎన్‌వోసీలతో పాటు ఆన్‌లైన్, మ్యుటేషన్‌ల వ్యవహారంలోనూ ఆర్డీవోపైన అనేక ఆరోపణలు ఉన్నాయి. మదనపల్లె ఆర్డీవోగా మురళి చేసిన కాలంలో ఫైళ్లపైన విచారణ జరిపితే ఆయన బాగోతాలు వెలుగులోకి వస్తాయని సొంత శాఖలోని సిబ్బందే బాహాటంగా పేర్కొంటున్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి హామీ బుట్టదాఖలు

- తుస్సుమన్న బీటీ యూనివర్సిటీ

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 1: నాలుగు రోజుల్లో రాష్ట్ర మంత్రుల క్యాబినెట్ సమావేశం ఉంది. అందులో మదనపల్లెలోని బీసెంట్ థియోసాఫికల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను యూనివర్సిటీగా మార్పు చేసే నిర్ణయం ప్రకటిస్తారు.. అంటూ సాక్షాత్తు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి బహిరంగ సభలో ఇచ్చిన మాటలను క్యాబినెట్ బుట్టదాఖలు చేసింది. రాయలసీమలో వైసీపీ నాయకుల్లో ఎదురులేని వ్యక్తిగా, సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడుగా పేరున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మాట ఇస్తే జరిగిపోతుందని మదనపల్లె ప్రజలు సంబరపడ్డారు. కానీ బుధవారం అమరావతిలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో మదనపల్లె బీటీ యూనివర్సిటీ ప్రస్తావనే రాలేదు. జనవరి 26వ తేదీ మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా నిస్సార్ అహ్మద్‌ను పరిచయం చేసేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి స్థానిక మిషన్ కాంపౌండులో వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపీ ప్రసంగిస్తూ మదనపల్లెలో బీటీ యూనివర్సిటీ ఏర్పాటుకు క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటారని, తామే మదనపల్లెను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కానీ క్యాబినెట్ సమావేశంలో బీటీ యూనివర్సిటీ ప్రస్తావనే రాలేదని తెలిసింది. మదనపల్లెలో బీటీ కళాశాలను ప్రభుత్వ పరం చేసుకోవాలని గతేడాది ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 100 రోజులకు పైగా విద్యార్థులు నిరసన దీక్షలు చేశారు. ఈ నిరసనలకు వైసీపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వడంతో ప్రభుత్వం కదిలింది. ఎయిడెడ్‌గా ఉన్న మదనపల్లె బీటీ కళాశాలను ప్రభుత్వపరం చేసుకుంది. ఇందులో భాగంగా బీసెంట్ సెనెటరీ ట్రస్టు ఆధీనంలో ఉన్న బీటీ కళాశాల ఆస్తుల్లో కేవలం భవనాలు, బోధన వస్తువులు, బోధనేతర వస్తువులు ప్రభుత్వ పరం చేసుకున్నారు. బీటీ కళాశాలకు అనుబంధంగా ఉన్న మైదానాలు, రవీంద్రనాథ్ ఠాగూర్ కాటేజి, ఎదురుగా ఉన్న భవనాలు, వసతి గృహం అలాగే వదిలేశారు. ఈ క్రమంలో బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను యూనివర్సిటీ చేసేస్తామని ఎంపీ మిథున్‌రెడ్డి మదనపల్లెకు వచ్చిన ప్రతిసారీ చెప్పారు. రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు వచ్చే సమయంలో మిథున్‌రెడ్డి మళ్లీ అదే పాట పాడారు. కానీ చివరి క్యాబినెట్ సమావేశంలో బీటీ యూనివర్సిటీ ప్రస్తావన లేకపోవడం చూస్తే మిథున్‌రెడ్డి ఇచ్చిన మాట బుట్టదాఖలు అయిందని మేధావులు పెదవి విరుస్తున్నారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ స్థానం

- బి.కొత్తకోట గురుకుల పాఠశాల విద్యార్థి రోహిత్ ప్రతిభ



అవార్డు అందుకుంటున్న రోహిత్

రాయచోటి టౌన్/బి.కొత్తకోట, ఫిబ్రవరి 1: బి.కొత్తకోట మండలం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి సామతోటి రోహిత్ సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్ పోటీలలో ప్రథమ స్థానం సాధించాడు. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఆరు రోజులపాటు విజయవాడ లోని మురళీ రిసార్ట్‌లో విశ్వేశ్వరయ్య సైన్స్ మ్యూజి యం, భారత సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ వారు ఈ పోటీ లు నిర్వహించారు. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరిల నుంచి 210 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ పోటీలలో వ్యక్తిగత విభాగంలో రోహిత్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ తాను తయారు చేసిన 'రేడియో ఫ్రీక్వెన్సీ గుర్తింపు (ఆర్ఎఫ్ఐడీ) ఆధారంగా పనిచేసే పెట్రోలు పంప్' అనే ప్రాజెక్టు తనను విజేతగా నిలిపిందన్నాడు. ఈ ప్రాజెక్టు రూపొందించడంలో తనను గైడ్ చేసిన గురువు రామచంద్ర, ప్రోత్సహించిన ప్రిన్సిపాల్ శ్రీరామ్ కోటేశ్వరరావుకు, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టరు శ్రీనివాస్, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి చేతుల మీదుగా రూ.1200 నగదు బహుమతితో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నాడు. కార్యక్రమంలో ఆర్జేడీ నాగమణి, సైన్స్ మ్యూజియం క్యూరేటర్ ఉషా మెహ్రా, కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారిణి తాహెలా సుల్తానా, రాష్ట్ర నోడల్ అధికారి భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. మంచి ప్రాజెక్టును తయారు చేసి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసిన రోహిత్, అతడి గైడ్ టీచర్ రామచంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ కోటేశ్వరరావులను జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ కబడ్డీ పోటీల విజేత హర్యానా

- రన్నర్‌గా నిలిచిన రాజస్థాన్ జట్టు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంటున్న హర్యానా జట్టు

రాజంపేట, ఫిబ్రవరి 1: రాజంపేట ఇన్‌ఫాంట్ జీసస్ హైస్కూల్ ప్రాంగణంలో ఐదు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీలు గురువారంతో ముగిశాయి. సెమీఫైనల్‌కు చేరిన రాజస్థాన్-హర్యానా జట్లు ఫైనల్‌లో తలపడగా హర్యానా జట్టు విజేతగా నిలిచి జాతీయ స్థాయి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. రన్నర్‌గా రాజస్థాన్ జట్టు నిలిచింది. మహారాష్ట్ర జట్టు మూడోస్థానంలో, ఉత్తర ప్రదేశ్ జట్టు నాల్గవ స్థానంలో నిలిచింది. జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ రాంబాబు, న్యాయమూర్తి పసుపులేటి శంకర్, ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి విజేతలకు ట్రోఫీలను, షీల్డ్‌ను, మెడల్స్‌ను అందజేశారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న హర్యానా జట్టు తాము ఓవరాల్ చాంపియన్ అని తెలియగానే క్రీడాప్రాంగణంలో కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తిగీతాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రాజంపేటలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం, పోటీలను ఎంతో చక్కగా నిర్వహించి వారికి అన్ని రకాలా వసతులు ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, భానుమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఫైనల్ పోటీలో తలపడుతున్న రాజస్థాన్-హర్యానా జట్లు



ముగింపు వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

- కలెక్టర్ అభిశిక్త్ కిశోర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిశిక్త్ కిశోర్


రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 1: జిల్లాలోని సచివాలయాలలో జగనన్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌లను వేగవంతం చేయాలని కలెక్టర్ అభిశిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి రెవెన్యూ, రీసర్వే, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఉపాధి హామీ, తాగునీరు సరఫరా, పది, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అంశాలలో భాగంగా చుక్కల భూములు, ఈనాం భూములను మార్గదర్శకాల మేరకు పరిష్కరించలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. జిల్లాలో మూడో దశ రీసర్వేలో సుమారు 20 వేలకుపైగా ఎకరాలు సర్వే చేయాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు అంశంలో భాగంగా డేటా అందుబాటులో ఉన్న ప్రతి సచివాలయంలో కనీసం ఒక రిజిస్ట్రేషన్ అయినా తప్పనిసరిగా చేయాలన్నారు. మహిళా శిశు సంక్షేమంలో భాగంగా గోరుముద్ద, పౌష్టికాహారాన్ని సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా జిల్లాలోని ఎక్కువ ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు వంద రోజులు పని కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరా అంశంపై సీపీడబ్ల్యు పథకం నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను మరింత పటిష్టవంతంగా నిర్వహించి ప్రతి ఒక్కరికీ వైద్యం అందేలా చూడాలన్నారు. జిల్లాలో నిర్వహించే పది, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వందేళ్లు దాటినా అభివృద్ధికి దూరం

ఈ పాఠశాల ఎందరికో అభివృద్ధి బాటలు వేసింది. పాఠశాలలో చదివిన చాలా మంది ఉన్నత శిఖరాలు అధిరోహించారు. కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌లు గానూ, మరికొందరు ఎమ్మెల్యేలుగా చరిత్ర పుటల్లోకి ఎక్కారు. అలాంటి పాఠశాల దీనస్థితి చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. పాఠశాల భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలోనే బ్రిటీష్ పాలన నుంచి విద్యార్థులకు విద్యనందించిన ఈ సరస్వతి నిలయం అభివృద్ధికి ఎప్పుడు నోచుకుంటుందోనని ఎందరో విద్యావంతులు, విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.



నందలూరులోని ఐఏఎస్‌ల పాఠశాలగా గుర్తింపు పొందిన సరస్వతీ నిలయం



ఎప్పుడు కూలుతుందో తెలియని రెండు అంతస్తుల భవనం

- షిఫ్ట్ పద్ధతిలో కొనసాగుతున్న పాఠశాల, కళాశాల తరగతులు
- కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు
- పట్టించుకునే నాథుడే కరువు
- ఎందరో ఐఏఎస్, ఐపీఎస్‌లను అందించిన పాఠశాల దీనస్థితి



కాలం చెల్లిన పరిపాలనా భవనం

నందలూరు, ఫిబ్రవరి 1: రాజంపేట నియోజకవర్గంలోని నందలూరు జడ్పీ పాఠశాల ఐఏఎస్‌లను అందించిన పాఠశాలగా చరిత్రకెక్కింది. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఈ పాఠశాలలో చదివిన ప్రతిఒక్కరూ అభివృద్ధిలో ముందుకెళ్తున్నారు. అలాంటి పాఠశాల దుస్థితి నేడు దారుణంగా తయారైంది. అనేక సంవత్సరాలుగా అభివృద్ధికి దూరమైంది. రాజంపేట నియోజకవర్గాన్ని నాటి నుంచి నేటి వరకు పాలించిన ఎమ్మెల్యేలంతా నందలూరు వాసులు కావడం గమనార్హం. దీంతో పాటు పాఠశాల ఇప్పటికే నూతన సొబగులతో కార్పొరేట్ పాఠశాలలు తలదన్నేలా అభివృద్ధిలో అడుగులు వేయాల్సి ఉంది. అయితే పాలకుల నిర్లక్ష్యమో అధికారుల అలసత్వమో అర్థం కావడం లేదు. భవనాల మధ్య బిక్కుబిక్కుమంటూ నెట్టుకొచ్చారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఈ ఐఏఎస్‌ల పాఠశాల పరిస్థితి మారింది. అనేక సంవత్సరాలుగా అభివృద్ధిలో వెనకడుగు వేస్తూనే ఉంది. 1908లో ఏర్పాటు చేసిన ఈ జిల్లా పరిషత్ పాఠశాల నేడు దయనీయ స్థితికి చేరుకుంది. ఎప్పుడు ఏ భవనం కూలుతుందోనని అటు విద్యార్థులతో పాటు ఇటు గ్రామస్థులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో పాఠశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన భవనాలను ఎందుకు తొలగించడం లేదో అంతుపట్టని విషయంగా మారింది. పరిపాలన భవనం కూడా కాలం చెల్లింది. ఇప్పటికే స్లాబ్ పెచ్చులూడి పడుతుండటంతో ఉపాధ్యాయులు, సిబ్బంది నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం నెట్టుకొస్తున్నారు. పాఠశాల దుస్థితి.. స్థానిక ప్రజాప్రతినిధులకు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు తెలిసినా ఎటువంటి ప్రయోజనం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కాలం చెల్లిన భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు కోరుతున్నారు. కాగా కాలం చెల్లిన భవనం వెనుకవైపు దాదాపు రూ.23 లక్షలతో అదనపు తరగతి గదులను నిర్మించడం గమనార్హం.

పాఠశాలలోనే కళాశాల తరగతులు

ఉన్న భవనాలు అంతంత మాత్రమే.. మరి ఇలాంటి తరుణంలో జడ్పీ పాఠశాల భవనాల్లోనే జూనియర్ కళాశాల తరగతులను నిర్వహిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో అటు పాఠశాల విద్యార్థులు, ఇటు కళాశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గతంలో పాఠశాల తరగతులు ఉదయం, మధ్యాహ్నం నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం ఉదయం పాఠశాల విద్యార్థులకు, మధ్యాహ్నం కళాశాల విద్యార్థులకు షిఫ్ట్ పద్ధతిలో క్లాసులు నిర్వహించడంతో విద్యార్థులు పూర్తి స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. రెండు పూటలా క్లాసులు నిర్వహిస్తే విద్యార్థుల్లో మేధోసంపత్తి మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఒకే పూట కావడంతో మిగిలిన సమయంలో విద్యార్థులు వృథాగా తిరుగుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శతాబ్ది ఉత్సవాలకు నోచుకోకపోవడం శోచనీయం..



ఉమ్మడి కడప జిల్లాలో ఐఏఎస్‌ల పాఠశాలగా ఖ్యాతి గడించిన ఈ పాఠశాలను ప్రారంభించి 115 సంవత్సరాలు పూర్తయింది. అయినా నేటికీ శతాబ్ది ఉత్సవాలకు నోచుకోకపోవడం శోచనీయం. ముఖ్యంగా జూనియర్ కళాశాలను కూడా హైస్కూలు భవనాల్లోనే షిఫ్టు పద్ధతిలో నిర్వహించడం సరైంది కాదు. ఇప్పటికైనా పాఠశాల శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు ముందుకు రావాలి.

- అల్లం అశోక్‌కుమార్, ఎస్టీయూ నేత, నందలూరు

క్రీడా మైదానం కేటాయించాలి..



పాఠశాలకు కేటాయించిన క్రీడా మైదానం 2కి.మీ. దూరంలో ఉండడం వల్ల విద్యార్థులకు నిరుపయోగంగా మారి, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు కొరవడుతున్నాయి. తల్లిదండ్రుల, గ్రామ ప్రజల, విద్యార్థుల కోర్కె మేరకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. పాఠశాలకు దగ్గరలోనే క్రీడా మైదానం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అంతేకాకుండా పూర్తి స్థాయిలో తరగతుల నిర్వహణను చేపట్టాలి.

- సమ్మెట శివప్రసాద్, మాజీ సర్పంచ్

బియ్యం పంపిణీ సరిగా జరగకపోతే చర్యలు

ఎండీయూ వాహనాల తనిఖీలో జేసీ గణేశ్‌కుమార్



చెన్నూరులో బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న జేసీ గణేశ్‌కుమార్

చెన్నూరు, ఫిబ్రవరి 1 : ప్రతినెలా వినియోగదారులకు అందించే బియ్యం పంపిణీ సక్రమంగా జరగకపోతే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టరు గణేశ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని చెన్నూరు, రామనపల్లె గ్రామాల్లో ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేసే బియ్యాన్ని జాయింట్ కలెక్టరుతో పాటు ఆర్డీవో మధుసూదన్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెన్నూరు పూలదొడ్డివీధి, పార్కువీధిల్లో బియ్యం ఎలా పంపిణీ అవుతుంది, ఏ సమయానికి వస్తున్నారు., సక్రమంగా అందిస్తున్నారా లేదా వంటి విషయాలను కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి బియ్యం పంపిణీ జరగాలని, వ్యక్తిగత, ఇతరత్రా కారణాలు చూపిస్తూ బియ్యం పంపిణీ మధ్యలో నిలిపి పంపిణీ చేయడం లాంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది కూడా ప్రతిరోజూ ఎండీయూ వాహనాలపై దృష్టి పెట్టాలని, ఏ చిన్నపాటి సమస్య ఉన్నా తెలపాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు ఆలీఖాన్, ఆర్ఐ సౌజన్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేషనల్ డిసేబుల్డ్ క్రికెట్ పోటీలకు శివకోటి



శివకోటి

నందలూరు, ఫిబ్రవరి 1: మూడవ మినీ నేషనల్ డిసేబుల్డ్ క్రికెట్ పోటీలకు నందలూరు వాసి అలుసూరి శివకోటి ఎంపికయ్యారు. నేషనల్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలకు బోర్డ్ ఆఫ్ డిసేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ తనను ఎంపిక చేయడమే కాకుండా వైస్ కెప్టెన్‌గా నియమించడం పట్ల అసోసియేషన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ పట్టణంలో ఈ పోటీలను నిర్వహిస్తారన్నారు. అజ్మీర్‌లో జరగబోయే పోటీల్లో బౌలింగ్, బ్యాటింగ్‌లలో శాయశక్తులా కృషి చేసి మంచి ప్రదర్శనతో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకొస్తానన్నారు.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఐడీపీఎస్ విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్

చాపాడు, ఫిబ్రవరి 1: ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ముగ్గురు రోలర్ రిలే స్కేటింగ్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చైర్మన్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఎంపికైన వారిలో అండర్-8 విభాగంలో దీక్షిత్, అండర్-10 విభాగంలో నక్షత్ర, మోక్షజ్ఞ ఉన్నారు. శ్రీలంకలో త్వరలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఆయన చెప్పారు. వీరు గోల్డ్‌మెడల్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడంతో జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్, డైరెక్టర్ లోహిత్‌రెడ్డి, సీబీఐటీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, పీఈటీ టీచర్ హర్షం వెలిబుచ్చారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలుశిక్ష, జరిమానా

కడప (క్రైం), ఫిబ్రవరి 1 : మద్యం తాగి మోటారు సైకిలు నడుపుతూ పోలీసుల తనిఖీలో పట్టుబడిన వ్యక్తికి 15 రోజుల జైలుశిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ కడప స్పెషల్ జేఎస్‌సీఎం కోర్టు తీర్పునిచ్చినట్లు కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. కడపకు చెందిన కొప్పుల మనోజ్‌కుమార్ జనవరి 30న మద్యం తాగి మోటారు బైకు నడుపుతూ పట్టుబడ్డాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా జైలుశిక్ష, జరిమానా విధించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పెద్దముడియం, ఫిబ్రవరి 1: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ టోపిసాబ్ (25) అనే యువకుడు మృతి చెందినట్లు పెద్దముడియం పోలీసులు తెలిపారు. పెద్దముడియం మండలం పాపేపల్లి గ్రామ పంచాయతీ గురివిరెడ్డిగారిపల్లికు చెందిన టోపీసాబ్ అతడి స్నేహితుడు షంషుద్దీన్‌తో కలిసి స్వంత పనులపై ద్విచక్రవాహనంలో మండలంలోని కలిచెర్లకు వెళ్లి వస్తుండగా బండమీదపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లికు చెందిన నసీమ్ (25) ద్విచక్రవాహనంలో వస్తుండగా కలిచెర్ల వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురుఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయమైన టోపిసాబ్‌ను తిరుపతికి రెఫర్ చేయగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు.

అల్లుడి హత్య కేసులో మామకు జీవిత ఖైదు



బాపతి సంజీవరెడ్డి (ఫైల్)

కడప(రూరల్)/కాశినాయన, ఫిబ్రవరి 1 : అల్లుడు రాజేష్‌రెడ్డిని హత్య చేసిన మామ బాపతి సంజీవరెడ్డి (49)కి జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ గురువారం ఆరవ అదనపు కోర్టు జిల్లా జడ్జి ఎస్.ఇంతియాజ్ అహమ్మద్ తీర్పునిచ్చారు. 2018 ఆగస్టు 5న కాశినాయన మండలం కోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన బాపతి సంజీవరెడ్డి (49) అతడి రెండవ అల్లుడైన బి.మఠం మండలం నరసన్నపల్లికి చెందిన పి.రాజేష్‌రెడ్డిని కుటుంబ కలహాల కారణంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఈ మేరకు మృతుడి స్నేహితుడైన కోనేటి గురుబ్రహ్మం కాశినాయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు హత్య కేసుగా నమోదు చేశారు. అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ వేసి ఆరవ అదనపు జిల్లా కోర్టులో నేర విచారణ నిర్వహించారు. ఈ మేరకు నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవితఖైదు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

310 మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లు, నిందితులతో సీఐ నరసింహారెడ్డి

కడప (క్రైం), ఫిబ్రవరి 1 : కడప నగరం తాడిపత్రి-తిరుపతి బైపాస్ రోడ్డులోని దేవునికడప ఆర్చి వద్ద పుదుచ్చేరి మద్యం బాటిళ్లు అమ్ముతున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలు వెల్లడించారు. కమలాపురం మండలం చిన్నపుత్త గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రెడ్డి నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన పెనుగొండ సిద్దగురు ప్రస్తుతం వీరపునాయునిపల్లె మండలంలోని అనిమెల గ్రామంలో నివాసం ఉంటున్నాడు. వీరిద్దరూ మద్యం బాటిళ్లు బైపాస్ రోడ్డు వద్ద విక్రయిస్తుండగా ఎస్ఐలు రవికుమార్, మహ్మద్‌రఫీలతో కలిసి దాడులు చేసి ఈ మేరకు వారిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న లగేజీ బ్యాగుల్లోని 310 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని తెలిపారు. ఈ మేరకు వారిని రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

- 2 లక్షల విలువ చేసే 40 కేజీల గంజాయి స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామచంద్ర

కడప (క్రైం), ఫిబ్రవరి 1 : కడప నగర శివారులోని డీటీసీ సర్కిల్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు రిమ్స్ సీఐ కె.రామచంద్ర తెలిపారు. తన కార్యాలయంలో గురువారం ఆయన నిందితుల వివరాలను వెల్లడించారు. కడప భాగ్యనగర్ కాలనీకి చెందిన సురభి మహేశ్, రాజారెడ్డివీధికి చెందిన షేక్ ఖాజావల్లి, మృత్యుంజయకుంటకు చెందిన శేఖర్ ఇతర ప్రాంతాల నుంచి లారీల ద్వారా గంజాయి తీసుకువచ్చి వాటిని కడపలో విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ ఆదేశాల మేరకు ఎస్ఐ నారాయణ సిబ్బందితో దాడులు చేసి వారిని అరెస్టు చేసి 40 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని గంజాయి విలువ రూ.2 లక్షలు ఉంటుందని తెలిపారు.

అన్నమయ్య జిల్లాకు 45 కొత్త బస్సులు



అధికారులతో మాట్లాడుతున్న డీపీటీవో రాము

పీలేరు, ఫిబ్రవరి 1: అన్నమయ్య జిల్లాకు ఈనెల 15వ తేదీలోపు 45 కొత్త బస్సులు రానున్నట్లు అన్నమయ్య జిల్లా డీపీటీవో రాము తెలిపారు. పీలేరు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలోని ఖాళీ ప్రదేశాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కొత్తగా వస్తున్నాయని తెలిపారు. కొత్త వాటిలో పీలేరు డిపోకు నాలుగు కేటాయించనున్నట్లు వెల్లడించారు. పీలేరు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో సుమారు 15 ఎకరాల భూమి ఖాళీగా ఉందని, 5, 15 సంవత్సరాల లీజు పద్ధతిలో ఆసక్తి గల వారికి అద్దెకివ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో గత ఏడాది కంటే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గాయని, రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక కౌన్సెలింగ్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎం బండ్లకుమార్, సీఐ సుబ్బన్న, బస్‌స్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప, ఏడీసీలు హనీఫ్, పీఎస్ఎం రాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం దివాళా తీసిందా..

- తక్షణమే ఆర్థిక బకాయిలు చెల్లించాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గఫూర్



యూటీఎఫ్ దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వం దివాళా తీసిందా అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గఫూర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. తక్షణమే వారికి రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ చేపట్టిన రెండోరోజు దీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలతో ఉద్యోగులను నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా ఉద్యోగులను వంచిస్తూనే ఉన్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలోపే ఓపీఎస్ విధానాన్ని అమలు చేస్తామని మాట ఇచ్చి ఐదేళ్ల కాలయాపన చేసి ఇప్పుడు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించలేమంటూ తోక ముడిచారన్నారు. మెరుగైన వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి జీతాల్లో కోత విధించి చరిత్ర హీనుడిగా మిగిలారన్నారు. కేవలం ఒక్క ఉద్యోగులకే రూ.25 వేల కోట్ల పైబడి బకాయిలు చెల్లించాలంటే ఈ ప్రభుత్వం దివాళా తీసినట్టుందని ఎద్దేవా చేశారు. బటన్ నొక్కడం ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పదేపదే ఆర్భాటంగా ప్రకటించుకున్న ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి బటన్ ఎందుకు నొక్కలేదో సమాధానం చెప్పాలన్నారు. ఈ ప్రభుత్వం రాబోవు ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వై.రవికుమార్, ఎస్.ఎజాజ్ అహ్మద్, ఎల్.చంద్ర ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులు, సీవీ రమణ, ఎస్.ఓబురెడ్డి, రూతు ఆరోగ్యమేరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్లపై వివక్ష చూపుతున్న ప్రభుత్వం

- ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 1 : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్యాంసుందర్‌రెడ్డి విమర్శించారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేసే ఉపాధ్యాయులను ప్రభుత్వ పరిధిలోకి తీసుకుని సర్వీసు రూల్స్ రూపొందించకపోవడంతో వారిని త్రిశంకుస్వర్గంలో ఉంచినట్లయిందన్నారు. మున్సిపల్ టీచర్లకు సర్వీసు రూల్స్ రూపొందించాలని డిమాండ్ చేశారు. అలాగే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలన్నారు. పీఎఫ్ సౌకర్యం కల్పించాలని మున్సిపల్ పాఠశాలలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఎంఈఓలను ఉప విద్యాధికారులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు క్రిష్టారెడ్డి. జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, జిల్లా నాయకులు రమేష్‌రెడ్డి, సుబ్బయ్య, అక్తర్‌బాషా పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి : పుత్తా

100 కుటుంబాలు టీడీపీలో చేరిక



రసూల్‌పల్లెలో టీడీపీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి తదితరులు

సీకేదిన్నె, ఫిబ్రవరి 1: తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం బుసిరెడ్డిపల్లె పంచాయతీ, రసూల్‌పల్లె పంచాయతీల్లోని వివిధ గ్రామాల్లో గురువారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రతి ఇంటికి తిరిగి మహిళలకు వివరించారు. బాబు చేపట్టిన పథకాలు మహిళలను చైతన్యపరుస్తూ వారి అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. వివిధ గ్రామాల్లో 100 కుటుంబాలు పుత్తా సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ డాక్టర్ల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణకిశోర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, సుబ్బారెడ్డి, రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోసం 4న 'విశాఖ దీక్ష'

పీలేరు, ఫిబ్రవరి 1: సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న విశాఖలో 'ఓట్ ఫర్ ఓపీఎస్, సాగర సంగ్రామం' పేరుతో నిరసన దీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీఎస్ఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ తెలిపారు. పీలేరులోని ఏపీసీ పీఎస్ఈఏ కార్యాలయంలో గురువారం ఆయన విశాఖ సభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కేవలం వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తానని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నన్నాళ్లూ దాని గురించి పట్టించుకోలేదన్నారు.

పల్లెల్లో తాగునీటి ఎద్దడి

- పంచాయతీలో నిధులు నిల్
- బోర్లు వేయలేమంటున్న సర్పంచులు
- ట్యాంకర్ల ద్వారానైనా నీటిని సరఫరా చేయాలంటూ వేడుకోలు



వ్యవసాయ బోరు వద్ద నీరు కోసం వేచి ఉన్న దృశ్యం



పనిచేయని మంచినీటి బోరు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 1: ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవకపోవడంతో మంచినీటి బోర్లు ఎండిపోయి వేసవి రాకమునుపే పల్లెల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. దీనికి తోడు పంచాయతీల్లో నిధులు లేనందున బోర్లు వేయలేమని సర్పంచులు చేతులెత్తేయడంతో ప్రజలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కనీసం ట్యాంకర్ల ద్వారానైనా తాగునీటిని తమకు అందించాలని వేడుకొంటున్నారు.

మండలంలోని పలు పల్లెల్లో తాగునీటి సమస్య అప్పుడే మొదలైంది. జూన్, జూలై నెలలో కొద్దిపాటి వర్షానికి బోర్లల్లో నీరు ఉండడంతో ఆ నీరు సెప్టెంబరు నెల వరకు ఇబ్బంది లేకుండా జరిగింది. బోర్లు, చేతిపంపుల్లో ఉన్న నీటితోనే సర్దుబాటు చేసుకొనేవారు. కానీ ఒక్కసారిగా మంచినీటి బోర్లల్లో ఉండే నీరు ఇంకిపోవడంతో తాగునీటి సమస్య మొదలైందని స్థానికులు చెబుతున్నారు. దిన్నెపాడు వడ్డెపల్లె, కే.వడ్డెపల్లె, కాకుళవరం, మిద్దెకాడపసల్లె, హరిజన వాడ, యర్రప్పగారిపల్లె, కొత్తరాజుపల్లె, బుర్జుపల్లె, మామిడిగారిపల్లె గ్రామాల్లో పూర్తిగా తాగునీటి సమస్య ఉండడంతో వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో అనుకూలంగా మామిడి తోటల వద్దకు వెళ్లి బిందెల ద్వారా నీరు తెచ్చుకొనేవారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు మొరపెట్టుకోగా ట్యాంకర్ల ద్వారా మూన్నాళ్ల ముచ్చటగా నీటిని సరఫరా చేశారని ఆరోపించారు. నవంబరులో తుఫాను కారణంగా కొద్దిపాటి వర్షం రావడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా నిలిపి వేశారని స్థానికులు వాపోయారు. పాళెం బుర్జుపల్లెలో ఉన్న మంచినీటి బోరులో నీరు ఇంకిపోయి వ్యవసాయ పంపుసెట్ల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆ గ్రామస్తులు గంగోజమ్మ, ఆదినారాయణ, నీళావతమ్మ, రఘునాథనాయుడు, జయమ్మలు వాపోయారు. మండలంలో వేసవి రాకమునుపే మంచినీటి బోర్లు అడుగంటిపోయి తాగునీటితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఆయా గ్రామ సర్పంచులను అడిగితే పంచాయతీలో నిధులు లేవని బోర్లు వేయలేమని అంటున్నారని ప్రజలు తెలిపారు.

గ్రామీణ పల్లెల్లో పశువులు, మేకలు, గొర్రెలు, గేదెలు మేపుకొనేవారు ఎక్కువ ఉంటారని, కనీసం వాటి అవసరాలకు కూడా నీరు లేక ఇబ్బందిగా ఉందన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తే సకాలంలో బిల్లులు రాలేదని యజమానులు అంటున్నారు.మూడు నెలలు కొన్ని గ్రామాలకు నీరు సరఫరా చేశామని, అయినా ఇంతవరకు బిల్లులు రాలేదని ట్యాంకర్ల యజమానులు ఆరోపిస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటిని అందించండి

- సభాపతినాయుడు, బుర్జుపల్లె



మూడు నెలల నుంచి తాగునీరు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఎవరూ పట్టించుకోలేదు. పండగ పూట నీరు లేక ఆడబిడ్డలను పిలిపించుకోలేకపోతున్నాము. బోరు ఎండిపోయి మూడు నెలలు కావస్తోంది. పశువులకు తాగునీరు లేక విక్రయించాలనుకుంటున్నాము. కనీసం ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలి.

వ్యవసాయ బోర్లను అశ్రయిస్తున్నాం

-పార్వతమ్మ, బుర్జుపల్లె



తాగునీరు లేక తెల్లవారగానే పనులు మానుకొని బిందెలు చేతపట్టుకొని వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీస్తున్నాం. మామిడి తోట వద్దకు వెళ్లినా.. కరెంటు లేకుంటే ఆ రోజంతా నీరు లేక ఇబ్బందులు పడాల్సిందే. పశువులకు నీరు లేక విక్రయించాలను కుంటున్నాం. బోరు వేయమంటే సర్పంచు, అధికారులు పట్టించుకోలేదు.

రూ.97 లక్షలతో బోర్లు వేసి నీరందిస్తాం

- కిశోర్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

జల్‌జీవన్ పథకం కింద రూ.97 లక్షలు మంజూరైంది. తొందరలో టెండర్ల ద్వారా బోర్లు ఎండిపోయిన గ్రామాల్లో బోర్లు వేసి కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తాం. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తాం.

కలెక్టరేట్‌లో కలియదిరిగిన కలెక్టర్

- రికార్డ్స్ సరిగా ఉండేలా చూసుకోవాలని ఆదేశం

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 1: రాయచోటి కలెక్టరేట్‌లోని పలు సెక్షన్లలో జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ అభిశిక్త్ కిశోర్ కలయదిరిగారు. పలు శాఖలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం శుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు చూసుకోవాలని ఇన్‌చార్జ్ ఏఓ నాగభూషణంను ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎస్‌డీసీ శ్రీలేఖ, సీసీ ఖలందర్ ఇతర అధికారులు ఉన్నారు.

అన్న క్యాంటీన్ నిర్వహించడం ఆనందదాయకం : గంటా చైత్ర



అన్నదానం నిర్వహిస్తున్న గంటా చైత్ర

రాజంపేట, ఫిబ్రవరి 1: రాజంపేటలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి నెల రోజులైందని ఈ కార్యక్రమాన్ని ఎంతో సేవాదృక్పదంతో నిర్వహించడం ఆనందంగా ఉందని గంటా చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గంటా చైత్ర పేర్కొన్నారు. గురువారం ఆమె అన్న క్యాంటీన్‌ను పరిశీలించి అనంతరం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారాలోకేష్, రాజంపేట నేతల ఆశీస్సులతో తన భర్త గంటా నరహరి జనవరి 1వ తేదీన అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారని, ప్రతి రోజూ 500 మంది భోజనం చేయడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈ అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి అందరికీ భోజనం పెట్టాలన్న ఆలోచన తమకుందని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంటా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు గోవింద్, రాజంపేట మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, తెలుగు మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు వాణి, ఒంటిమిట్ట టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, జిల్లా టీడీపీ కార్యదర్శి సిద్దవటం నాయకులు నాగమునిరెడ్డి, క్షత్రియ సంఘ నాయకులు అంజన్‌రాజు, టీడీపీ వాణిజ్య విభాగం సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి ఉగ్రవీంద్ర, ఆర్యవైశ్య యువజన నాయకులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారుగా మురాద్‌షావలి



బాధ్యతలు చేపట్టిన నూతన తహశీల్దారు

సిద్దవటం, ఫిబ్రవరి 1: మండలం తహశీల్దారుగా మురాద్‌షావలి గురువారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తహశీల్దారుల బదిలీలు జరిగిన విషయం విదితమే.. సిద్దవటం తహశీల్దారుగా పనిచేస్తున్న లక్ష్మీదేవి తిరుపతికి బదిలీ అయ్యారు. సత్యసాయి జిల్లా మడకశిరలో తహశీల్దారుగా పనిచేస్తున్న మురాద్షావలి సిద్దవటం తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

గొడవలకు ఆస్కారం ఇవ్వొద్దు : ఎస్ఐ



చెన్నరాజుపోడులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 1: రాబోయే ఎన్నికల్లో గ్రామస్తుల మధ్య గొడవలకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ జరిగేలా చూడాలని ఎస్ఐ చిన్నపెద్దయ్య అవగాహన కల్పించారు. మండల పరిధిలోని చిన్నరాజుపోడు, ముక్కావారిపల్లె తదితర గ్రామాల్లో గ్రామస్తులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఘర్షణలు, రౌడీయిజం, బెదిరించడం వంటి వాటికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని, తద్వారా మీ కుటుంబాలు ఇబ్బందులు పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతా వారోత్సవాల సందర్భంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేటటౌన్, ఫిబ్రవరి 1: భద్రతా వారోత్సవాల సందర్భంగా రాజంపేట మోటారు వాహనాల అధికారి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, దానివల్ల ఎంతటి ప్రమాదం జరిగినా ప్రాణనష్టం ఉండదన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ డీఎం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం : తహశీల్దారు



వల్లూరుపల్లె చెరువులో మామిడి చెట్లు తొలగిస్తున్న తహశీల్దారు, రెవెన్యూ సిబ్బంది

పుల్లంపేట, ఫిబ్రవరి 1: మండలంలోని కొమ్మనవారిపల్లె పంచాయతీ వల్లూరుపల్లె చెరువులో చెరువును ఆక్రమించి మామిడి చెట్లు నాటడంపై గ్రామస్తులు గురువారం తహశీల్దారు నరసింహకుమార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే వీఆర్వో సోమశేఖర్‌రెడ్డి, సర్వేయర్లతో కలిసి తహశీల్దారు చెరువును పరిశీలించారు. మూడు రోజుల క్రితం నాటిన మామిడి చెట్లను తహశీల్దారు తన సిబ్బందితో తొలగిస్తుండగా ఆక్రమణదారులు అడ్డుకున్నట్లు తెలిసింది. చెరువులో అధికభాగం ఆక్రమణకు గురైందని పలు రకాల పంటలు వేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పట్టుబడడంతో ఆక్రమణదారులందరికీ ఏడు నోటీసులు అందజేయాలని వీఆర్వోను ఆదేశించారు. అలాగే చెరువును పూర్తిగా సర్వే చేయాలని, వారం రోజుల్లోపు సర్వే పూర్తి కావాలని ఆదేశించారు. ఆక్రమణదారులందరికీ నోటీసులు ఇచ్చి సర్వే పూర్తైన వెంటనే ఆక్రమణలను తొలగిస్తామని గ్రామస్తులకు తహశీల్దారు హామీ ఇచ్చారు. అనంతరం కొత్తపేట సమీపంలో భూఆక్రమణపై తహశీల్దారు పరిశీలించి వారికి కూడా నోటీసులు వెంటనే జారీ చేయాలని వీఆర్వోను ఆదేశించారు.

తాగునీటి కోసం మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

సిద్దవటం, ఫిబ్రవరి 1: మండలంలోని జంగాలపల్లె గ్రామ పంచాయతీ కమ్మపాలెం దళితవాడ మహిళలు తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని కమ్మపాలెం, గ్రామ ప్రజలు ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో తాగునీరు లేక నానా అవస్థలు పడుతుంటే అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడం దారుణమన్నారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీలో విద్యుత్ దీపాలు కూడా రాత్రి వేళలో పనిచేయడం లేదని, వెంటనే దీపాలు వెలిగించేలా చూడాలని లేనిపక్షంలో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని వారు హెచ్చరించారు.

శ్రీసాయి పాఠశాల విద్యార్థుల ప్రతిభ



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ప్రిన్సిపల్ రేణుకాదేవి

రాజంపేటటౌన్, ఫిబ్రవరి 1: పులివెందుల లయోలా డిగ్రీ కళాశాలలో యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన యూఎస్‌వో ఇంటర్ స్కూల్ టెస్ట్ పోటీల్లో రాజంపేట శ్రీసాయి విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన నిర్వహించి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు గెలుచుకొని విజేతలుగా నిలిచారు. వీరు జాతీయ స్థాయి ఢిల్లీలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల కరస్పాండెంటు డాక్టర్ బాలరాజు, ప్రిన్సిపల్ పి.వి.రేణుకాదేవిలు మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు అభిలాష్, శివసాయి, సుబ్రమణ్యం, శిరీష, షాహిదా, కల్పనలు విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చినందుకు అభినందించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

హోటళ్లను తనిఖీ చేసిన కమిషనర్



హోటల్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 1: రాయచోటి పట్టణంలోని పలు హోటళ్లను గురువారం రాయచోటి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హోటల్స్‌లోని పరిసరాలు, వంట గదులు పరిశుభ్రంగా పెట్టుకోవాలని, ప్లాస్టిక్ కవర్లు వాడరాదన్నారు. హోటల్స్‌కు వచ్చే వినియోగదారులకు అందించే భోజనంలో నాణ్యత లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పట్టణంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారుల సహకారంతో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, హెల్త్ అసిస్టెంట్ తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం, ఫిబ్రవరి 1: మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ పరిధిలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంగ్లీషు మీడియం 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో (ఎంపీసీ, బైపీసీ) 2024-25 సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్ తెలిపారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీన జరగుతుందన్నారు. జిల్లాలోని ఏ ప్రాంతం వారైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9704550121 నెంబరును సంప్రదించాలని ఆయన తెలిపారు.

కురబలు ఐక్యతను చాటుకోవాలి

- జనసేన అసెంబ్లీ సమన్వయకర్త అతికారి దినేశ్

సుండుపల్లె, ఫిబ్రవరి 1: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కురబల ఐక్యతను చాటుకోవాలని జనసేన రాజంపేట అసెంబ్లీ సమన్వయకర్త అతికారి దినేశ్ తెలిపారు. సుండుపల్లెలో గురువారం కురబల ఆత్మీయ సమ్మేళన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కలిసి ఉంటేనే కురబల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 52 శాతం బీసీల ఓటు బ్యాంకు ఉందన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా అతికారి కుటుంబం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కురబ సంఘం నాయకులు జయరాం, రమణ, అశోక్, చిన్నకృష్ణ, రమణ, రామయ్య, టీడీపీ నాయకులు చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు నడుం బిగించాలి

నందలూరు, ఫిబ్రవరి 1: కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ నడుం బిగించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రిన్సిపల్ శ్రీదేవి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ నీలవేణి ఆధ్వర్యంలో నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని నందలూరు జడ్పీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరం గురువారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా నీలవేణి మాట్లాడుతూ మానవ జీవన విధానంలో చెట్లు ఒక భాగమని, అన్ని విధాలా తోడ్పాటు అందిస్తాయని, ప్రకృతి సమతుల్యంగా ఉండేందుకు దోహదం చేస్తాయన్నారు. ఎన్ఎస్ఎస్‌లో విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నిబద్ధత, సహకార గుణం, శ్రమ విలువలతో పాటు సామాజిక బాధ్యత, జాతీయ భావన లాంటి ఉన్నతమైన అలవాట్లు అలవరతాయన్నారు. అనంతరం క్రీడా మైదానం చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలి



రాజంపేటలో ఆందోళనలు నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజంపేట, ఫిబ్రవరి 1: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ, పీఆర్‌సీ, సరెండర్ లీవులను చెల్లించాలని పేర్కొంటూ యూటీఎఫ్ నాయకులు ఆందోళన నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్‌రాజు, జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నాగేంద్ర, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు. అధికారంలోకి రాకముందు ప్రతిపక్ష నేతగా జగన్ తమకు అన్ని విధాలా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఇకనైనా తమకు రావాల్సిన బకాయిలను చెల్లించి తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నియంత పాలన పోవాలి : జనసేన



జనంలో జనసేన కార్యక్రమంలో శ్రీనివాసరాజు

నందలూరు,ఫిబ్రవరి 1: ప్రస్తుతం రాష్ట్రంలో నియంతపాలన పోయి త్వరలోనే జనం పాలన రావాలని రాజంపేట నియోజకవర్గ జనసేన నేత శ్రీనివాసరాజు అన్నారు. గురువారం మండలంలోని ఎర్రచెరువుపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఈడిగపల్లెలో జరిగిన 'జనంలో జనసేన' కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి తిరిగి జనసేన పార్టీ ఆశయాలను, సిద్ధాంతాలను వివరిస్తూ కరపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో నానాటికి దుర్భరమైన పరిస్థితులు నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట ప్రసాద్, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని ఎర్రచెరువుపల్లె పంచాయతీ, బాలక్ష్మాపురంలో ఇంటింటా గాజుగ్లాసు గుర్తును, జనసేన సిద్ధాంతాలను జనసేన నేతలు ప్రజలకు చేరువ చేశారు.

బాలసుబ్రహ్మణ్యంను కలిసిన మైనార్టీలు

చిన్నమండెం, ఫిబ్రవరి 1: మండల కేంద్రానికి చెందిన ముస్లిం మైనార్టీ యువకులు టీడీపీ రాజంపేట పార్లమెంటు అభ్యర్థి సుగవాసి బాలసుబ్రహ్మణ్యంను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. వారితో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. వైసీపీ అరాచక పాలన గురించి ప్రజలకు వివరించాలని ఆయన యువకులకు సూచించారు. అనంతరం మండలంలోని కొత్తపల్లె పంచాయతీ హరిజనవాడలో గురువారం రాత్రి జరిగిన గద్దె పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కిశోర్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు, బాలచంద్ర యాదవ్, జిల్లా మైనార్టీ నాయకులు ఇర్షాద్‌ఖాన్, మదార్, వాజిద్, సైఫుల్లా, తౌహీద్, బడిశెట్టి రవి, మనోహర, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరాధన మహోత్సవాలు

రామాపురం, ఫిబ్రవరి 1: మండలంలోని నీలకంఠరావుపేట సమీపంలో వెలసిన సద్గురు దర్గా స్వామిజీ ఆరాధన ఉత్సవాలు శుక్ర, శనివారాల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 2న ఉదయం 8 గంటలకు గంగపూజ, కలశ స్థాపన, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, మహామంగళహారతి, సాయంత్రం గురుపూజ, విష్ణు సహస్రనామార్చన, మంగళహారతి ఉంటుందన్నారు. 3వ తేదీన ఉదయం 7 గంటలకు కలశపూజ, సద్గురు పూజ, రుద్రాభిషేకం, గణపతి, నవగ్రహ, రుద్ర, సద్గురు హోమాలు, మహామంగళహారతి, ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సాయంత్రం పల్లకీ మెరవణి ఉత్సవం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ బెంగళూరు వేదపండితుల ఆధ్వర్యంలో జరుగుతాయని వారు తెలిపారు. భక్తులందరూ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

వృత్తి విద్య నైపుణ్యంపై విద్యార్థులకు అవగాహన



సాఫ్ట్‌వేర్ గురించి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనగలూరు, ఫిబ్రవరి 1: మండల కేంద్రంలోని పెనగలూరు ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రిన్సిపల్ ఎస్.సహజబ్లెస్సీ అధ్యక్షతన వృత్తివిద్య కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గురువారం సింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ గురించి, పెనగలూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో హార్డ్‌వేర్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాఫ్ట్‌వేర్ గురించి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాలలో జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ, విద్యార్థి తప్పనిసరిగా వృత్తివిద్యా కోర్సును నేర్చుకున్నట్లైతే జీవితంలో స్థిరపడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో వృత్తివిద్యా ఉపాధ్యాయులు వి.వెంకటయ్య, శ్రీనివాసులు, జి.శ్రీనివాసులరావు, పీజీటీ, జువాలజీ టీచర్ గంగాధర్‌రావు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి : పీడీఎస్‌యూ

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 1: మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానం-2020ను వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈ నెల 3న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆయన 'చలో ఢిల్లీ' కార్యక్రమ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి వాసుదేవనాయుడు, జిల్లా నాయకుడు స్వరూప్ తేజ, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

దత్తత గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

చిన్నమండెం, ఫిబ్రవరి 1: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన బెస్తపల్లెలో ఏడు రోజులపాటు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. స్వచ్ఛతయే సౌభాగ్యమని బెస్తపల్లెలో వివిధ సేవా కార్యక్రమాలు, స్వచ్ఛభారత్ నిర్వహించి పిచ్చి మొక్కలు తొలగించడం, చెత్తాచెదారాన్ని లేకుండా తొలగించడం, దోమలను నివారించడం కోసం బ్లీచింగ్ పౌడర్ చల్లినట్లు ఎన్ఎస్ఎస్ పీవో నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోకనాథరెడ్డి, శేఖర్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు మండలాల కేటాయింపు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 1: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జోన్-4 పరిధిలోని అనంతపురం, వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల నుంచి బదిలీపై చిత్తూరు జిల్లాకు వచ్చిన తహసీల్దార్లలో 31 మందికి మండలాలు కేటాయిస్తూ గురువారం కలెక్టర్ షన్మోహన్ ఉత్తర్వులు జారీచేశారు. వీరు వెంటనే వారికి కేటాయించిన మండలాల్లో బాధ్యతలు చేపట్టాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది జూన్ 30 నాటికి మూడేళ్ల పదవీకాలం పూర్తవ్వని, జూన్ 30 నాటికి పదవీ విరమణ చేయనున్న 10 మంది తహసీల్దార్లను ఎన్నికేతర విభాగాల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

● పెద్దపంజాణిలో పనిచేస్తున్న బి.లోకేశ్వరరావును గంగవరానికి, తిరుపతి జిల్లా బి.ఎన్.కండ్రిగలో పనిచేస్తున్న జి.శివయ్యను వెదురుకుప్పానికి బదిలీ చేశారు. చిత్తూరు కలెక్టరేట్‌లోని భూసేకరణ విభాగంలో పనిచేస్తున్న పి. వెంకటేశ్వరన్‌ను కలెక్టరేట్ ఏవోగా, పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న ఎం. ప్రసాద్ బాబును కలెక్టరేట్ భూసేకరణ విభాగ ఏవోగా నియమించారు. పలమనేరులో పనిచేస్తున్న ఈజీ కుప్పస్వామిని పలమనేరు ఆర్డీవో కార్యాలయ ఏవోగా, పూతలపట్టులో పనిచేస్తున్న వై. విజయభాస్కర్‌ను చిత్తూరు ఆర్డీవో కార్యాలయ ఏవోగా, ఐరాలలో పనిచేస్తున్న పి.సుశీలను చిత్తూరు కలెక్టరేట్‌లోని కోఆర్డినేషన్ సెక్షన్‌కు సూపరింటెండెంట్‌గా, తవణంపల్లిలో పనిచేస్తున్న కె. గుణశేఖర్‌రెడ్డిని చిత్తూరు కలెక్టరేట్ మెజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, విజయపురంలో పనిచేస్తున్న పి. వెంకట్రాయులును కలెక్టరేట్‌లోని భూసేకరణ విభాగ సూపరింటెండెంట్‌గా నియమించారు. ప్రస్తుతం సస్పెన్షన్‌లో కొనసాగుతున్న సోమల తహసీల్దార్ ఎస్. షబార్ బాషాను చిత్తూరు కలెక్టరేట్ కార్యాలయంలో కేఆర్ఆర్సీ తహసీల్దార్‌గా నియమిస్తూ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

మండలాల కేటాయింపుల వివరాలిలా వున్నాయి ....

● ఉమ్మడి అనంతపురంజిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్లు.. కె.విజయలక్ష్మి (గుడిపాల), ఎ.హరికుమార్ (కుప్పం), డి.వసంతలత (పులిచెర్ల), ఇ.నాగరాజు (సోమల), టి.నారాయణస్వామి (సదుం), డి.నీలకంఠారెడ్డి (చౌడేపల్లె), వై.రంగనాయకులు (పలమనేరు), జి. నాగేంద్ర (పెద్దపంజాణి), సయ్యద్ షాబుద్దీన్ (గుడుపల్లె), పి.సుబ్బలక్ష్మమ్మ (పాలసముద్రం), కె.శ్రీధర్ (రామకుప్పం), స్వర్ణలత (బైరెడ్డిపల్లె), ఎ.సురేష్ కుమార్ (వి.కోట), టి.ఆర్.మురళీకృష్ణ (శాంతిపురం).

● **కడప జిల్లా నుంచి వచ్చిన..** పి.శ్రీనివాసరెడ్డి (చిత్తూరు అర్బన్), ఎస్.చంద్రశేఖర్ రెడ్డి (నగరి), ఎం.వి. సుబ్రహ్మణ్యంరెడ్డి (పుంగనూరు), ఎం.దైవాదీనం (యాదమరి)కి మండలాలు కేటాయించారు.

● **ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్లు..** కె.నాగమణికి (నింద్ర), షేక్ హసీనాబీ (తవణంపల్లె), టి.శ్రీనివాసులు (ఐరాల), డి.ఆల్ఫ్రెడ్ (శ్రీరంగరాజపురం), జి.వి.మల్లికార్జున రావు (విజయపురం), పి.షేక్ మొహిద్దీన్ (రొంపిచెర్ల), జి.సుభద్రమ్మ (బంగారుపాళ్యం), ఎం.శివరాముడు (పూతలపట్టు), ఎస్.సుభద్ర (పెనుమూరు), బి.పుష్పకుమారి (కార్వేటినగరం), ఐ.వేణుగోపాల్‌రావు (కుప్పం ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి), ఎస్.రవి (గంగాధరనెల్లూరు), డి. చంద్రశేఖర్ (నగరి ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి)గా నియమితులయ్యారు.

మేటిమంద వద్ద జంట ఏనుగులు

సోమల, ఫిబ్రవరి 1: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నం డ్యాం వద్ద బుధవారం రాత్రి జంట ఏనుగులు సంచరించడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. డ్యాం సమీప మామిడి లో జంట ఏనుగులు డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. నడింపల్లె, మాలపల్లె, దాదెం గొల్లపల్లె పరిసరాల్లో సంచరించి గురువారం పగలు మేటిమంద పొలాల వద్ద ఏనుగుల సంచారం ను రైతులు గుర్తించి ఇళ్లకు చేరుకున్నారు. మూడేళ్ల క్రితం ఈప్రాంతంలోనే ఏనుగుల మంద సంచరించాయి. అటవీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడండి

● అధికారులకు జడ్పీ చైర్మన్ సూచన



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 1: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఇప్పట్నుంచే తగిన చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం జడ్పీ చైర్మన్ ఛాంబర్‌లో 2, 3, 4, 5, 6 స్థాయి సంఘాల సమావేశాలు జరిగాయి. ముందస్తుగా అన్ని గ్రామాల్లో వాటర్ ట్యాంకులు శుభ్రం చేసుకోవాలని, మంచినీటి పైపులను మరమ్మతులు చేయాలని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని సూచించారు. రబీ సీజన్‌లో పంటల సాగు విస్తరణ మరింత ఎక్కువ చేయాలన్నారు. పట్టుపరిశ్రమ అభివృద్ధికి మరిన్ని ప్రోత్సాహకాలు అందివ్వాలని సూచించారు. మామిడి పంటకు వచ్చే వ్యాధుల నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టేందుకు పలు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశాల్లో జడ్పీ వైస్‌చైర్మన్ రమ్య, సీఈవో ప్రభాకర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, జడ్పీటీసీలు పాల్గొన్నారు. కాగా ముఖ్యమైన స్థాయిసంఘ సమావేశాలకు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో పాటు మంత్రులెవ్వరూ హాజరుకాలేదు.





బహిరంగసభకోసం ఎంపిక భూమిపూజ చేస్తున్న నేతలు - వేదిక, సభా స్థలి ఏర్పాటుకు వచ్చిన సామగ్రి

రామానాయుడుపల్లె వద్దే చంద్రబాబు సభ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 1: మాజీ సీఎం చంద్రబాబు 'రా..కదలిరా' బహిరంగ సభకు గంగాధర నెల్లూరు పంచాయతీ రామానాయుడుపల్లె వద్ద స్థలాన్ని ఎంపిక చేశారు. రామానాయుడుపల్లె (చిత్తూరు - పుత్తూరు ప్రధాన రోడ్డుపక్కన) బస్టాప్ వద్ద ఈ స్థలంలో సభా వేదిక ఏర్పాట్లకు గురువారం భూమిపూజ చేశారు. ఈ స్థలంలో మంగళవారం చంద్రబాబు సభ జరగనుంది. ఈ సభా స్థలాన్ని మాజీ మంత్రి అమరనాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు పులివర్తినాని, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి థామస్, నియోజకవర్గ పరిశీలకుడు రవిప్రకాష్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో నగరి, పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జిలు గాలి భానుప్రకాష్, మురళిమోహన్, జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల క్రిష్ణమనాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికారసమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి రాంబాబురెడ్డి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ, గంగాధరనెల్లూరు, శ్రీరంగరాజుపురం, కార్వేటినగరం మండలాల టీడీపీ అధ్యక్షులు స్వామిదాస్, జయశంకర్‌నాయుడు, చెంగల్రాయయాదవ్, ఇతర నాయకులు పాల్గొన్నారు. కాగా, భూమి పూజ చేసిన వెంటనే ఎక్స్‌కవేటర్‌తో ముళ్లకంపలు, పిచ్చిమొక్కలను తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. మరో వైపు వేదిక, సభా ప్రాంగణం కోసం అవసరమైన మెటీరియల్‌తో లారీలు గురువారం సాయంత్రానికి చేరుకున్నాయి.

వీర్నమలలో రంకెలేసిన కోడెగిత్తలు



బరిలో పరిగెత్తించేందుకు ఎద్దులను సిద్ధం చేస్తున్న రైతులు - బరిలో పరుగు తీస్తున్న ఎద్దులు

రామకుప్పం, ఫిబ్రవరి 1: రామకుప్పం మండలం వీర్నమల గ్రామంలో గురువారం జల్లికట్టు నిర్వహించారు. జల్లికట్టును చూసేందుకు వచ్చిన వేలాదిమంది జనంతో వీర్నమల వీధులు జనసంద్రంగా మారాయి. జల్లికట్టు పరుగుపందెంలో మెరుపువేగంతో పరుగులు తీసే ఎద్దుల యజమానులకు మొదటి బహుమతి రూ.40వేలు, రెండో బహుమతి రూ.30 వేలు,మూడో బహుమతి రూ.20వేలు, నాలుగో బహుమతి రూ.15వేలు, ఐదో బహుమతి రూ.10వేలు, ఆరో బహుమతిగా రూ.7వేలుతో బాటు మరో 44 నగదు బహుమతులు, మరో 23బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు పదిహేను రోజులుగా ప్రచారం చేశారు. దీంతో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి వందలాది మంది రైతులు తమ ఎద్దులను తెల్లారి జామునే వీర్నమలకు తీసుకొచ్చారు. ఉదయం గంగమ్మ ఆలయంలో రైతులు పూజలు చేశారు. అనంతరం డప్పుల హోరు మధ్య తమ ఎద్దులను బరిలో పరుగులు తీయించారు. వీటిని నిలువరించేందుకు యువకులు పోటీలు పడ్డారు. సాయంత్రం అతి తక్కువ సమయంలో ఎద్దుల యజమానులకు నిర్వాహకుల బహుమతులు అందజేశారు. జల్లికట్టులో ఒకరిద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సందర్భంగా తమిళనాడు నుంచి వచ్చిన రైతులు పలు ఎద్దులను రూ.1లక్ష నుంచి రూ.15లక్షల వరకు కొనుగోలు చేసినట్టు స్థానికులు తెలిపారు.



పరుగు పెడుతున్న కోడెగిత్తలను నిలువరిస్తున్న యువకులు - జనసంద్రంగా మారిన కెనమాకులపల్లె

కెనమాకులపల్లెలో ఎద్దుల పండుగ

శాంతిపురం : శాంతిపురం మండలం కెనమాకులపల్లెలో నిర్వహించిన ఎద్దుల పండుగ గురువారం కోలాహలంగా జరిగింది. పశువులకు రంగురంగుల కాగితాలతో అలంకరించి సంప్రదాయ బద్ధంగా తోరణాలు కట్టి గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధిలో పశువులకు టవళ్లు కట్టి పరుగులు పెట్టించారు. వాటిని నిలువరించేందుకు యువకులు ఎగబడ్డారు. ఈ క్రమంలో పలువురు గాయపడ్డారు. ఈ వేడుకను తిలకించేందుకు భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో కెనమాకులపల్లె జనసంద్రాంగా మారింది.




అల్లిలో కోడెగిత్తను వదిలి పెడుతున్న దృశ్యం

ఘనంగా మైలేరు పండుగ

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె మండలం జంగాలఅగ్రహారం వద్ద గురువారం మైలేరు పండుగ కోలాహలంగా నిర్వహించారు. కోడెగిత్తలకు నిర్వాహకులు భారీనగదు బహు మతులు ప్రకటించడంతో వివిధప్రాంతాల నుంచి పలువురు తమ పశువులను తీసు కొచ్చారు. కోడెగిత్తలను నిలువరించడానికి యువకులు పోటీపడ్డారు. మైలేరు పండు గను తిలకించడానికి అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు.

చనిపోయినా ఓట్లు పదిలం

తమిళంలో ఓటర్ల పేర్లు



కేజీకండ్రిగలో మృతిచెందిన వారికీ ఓట్లు | ఓటర్ల జాబితాలో తమిళంలో పేర్లు

నగరి, ఫిబ్రవరి 1: చనిపోయినా ఓట్లు మాత్రం పదిలం. ఇది నగరి మండల పరిధిలోని 165వ పోలింగు బూత్‌లో పరిస్థితి. కేజీకండ్రిగలో 19 మంది చనిపోయిన వారికి అలాగే ఓటర్ల జాబితాలో ఓట్లు ఉన్నాయి. పకడ్బందీగా జాబితా తయారీ చేశామని చెప్పే అధికారులు దీనికి ఏం సమాధానం చెబుతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇక, నగరి పట్టణ పరిధిలోని 140వ పోలింగు బూత్‌లో 1055, 1056 సంఖ్య గల ఓటర్ల పేర్లు తమిళంలో ముద్రించి ఉన్నారు. అలాగే బూత్ నెంబరు 143లోనూ కొందరు ఓటర్ల పేరు తమిళంలో ఉన్నాయి.

ముగిసిన జేఈఈ మెయిన్స్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 1: చిత్తూరులోని సీటమ్స్‌లో ఈనెల 24న మొదలైన జేఈఈ మెయిన్స్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షలకు 256 మంది విద్యార్థులకు గాను 248 మంది హాజరు కాగా, ఎనిమిది మంది గైర్హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. ఉదయం పరీక్షకు 128 మందికి గాను 124 మంది.. మధ్యాహ్నం 128 మందికి గాను 124 మంది హాజరయ్యారన్నారు.

అమీర్ జాన్‌పై దాడి, అరెస్టు దారుణం



మైనారిటీ నేతలతో కలిసి మాట్లాడుతున్న ఖాజాపీర్

పలమనేరు, ఫిబ్రవరి 1: బైరెడ్డిపల్లె మండలం దేవదొడ్డి గ్రామానికి చెందిన మహిళా సర్పంచ్ భర్త అమీర్‌జాన్ పై వైసీపీ నాయకులు అమానుషంగా దాడిచేయడంతో పాటు పోలీసులు సైతం ఏక పక్షంగా వ్యవహరించి బాధితుడు అమీర్‌జాన్‌ను అరెస్టుచేయడం దారుణమని మైనారిటి నాయకులు పేర్కొన్నారు. గురువారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వీరు మాట్లాడారు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికి అధికారం ఉంది కదాఅని దేవదొడ్డి ఎంపీటీసీ అహంతో అమీర్‌జాన్ కు చెందిన స్థలంలో దౌర్జన్యంగా అక్రమ నిర్మాణాన్ని చేపట్టడంతో ప్రశ్నించిన నేరానికి దౌర్జన్యానికి పాల్పడటం ఎంతవరకు సమంజసమన్నారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు వైసీపీ గూండాలకు కొమ్ము కాయడం దారుణమన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కన్వీనర్ ఖాజా పీర్, మైనారిటి నాయకులు చాంద్‌బాషా, ముబారక్, రహీం, హనీఫ్, మాభాషా, అఫ్రోజ్, బాబాజాన్, అమానుల్లా, షరీఫ్, మౌలా, నదీమ్, సాధిక్, తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడుకు స్థానికులు పనికిరారా?


● వైసీపీలో పెరుగుతున్న అసంతృప్తి

● టికెట్ స్థానికులకే ఇవ్వాలని డిమాండ్

సత్యవేడు, ఫిబ్రవరి 1: సత్యవేడు వైసీపీలో స్థానికేతర అంశం తెరమీదకొచ్చింది. ముక్కూ మొహం తెలియని వాళ్లకు టికెట్ ఇస్తే పనిచేసేది లేదని ఆ పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా తమ వాదనలు వినిపిస్తున్నారు. స్థానికులకే అభ్యర్థిత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్తను రోజుల వ్యవధిలోనే పార్టీ అధిష్ఠానం మారుస్తూ వచ్చిన విషయం తెలిసిందే. బుధవారం వైసీపీ విడుదల చేసిన ఐదవ జాబితాలో సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా గంగాధర నెల్లూరుకు చెందిన నూకతోటి రాజేష్ పేరు ప్రకటించారు. దీనిపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పార్టీ పెద్దల నిర్ణయంపై ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. ఇరవై రోజుల వ్యవధిలో రెండుసార్లు అభ్యర్థులను మార్చడం, కనీసం తమ అభిప్రాయాలనైనా తీసుకోకుండా అభ్యర్థిని నియమించడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో అధిష్ఠానాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నారు. 2019లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలాన్ని ప్రకటిస్తే గెలిపించాం. ఇప్పుడు ఆయనకాదు గురుమూర్తి అంటే ఒప్పుకున్నాం. అందరికంటే ముందు ఆయనను ప్రసన్నం చేసుకోవాలన్న ఆరాటంతో ఆయనను కలిసి సన్మానించాం. తీరా ఆయన కూడా కాదు ఇంకొకరిని తీసుకొచ్చి ఇతనే మీ అభ్యర్థి అంటే మీకంటికి మేం ఎలా కనిపిస్తున్నామంటూ ఓ రేంజ్‌లో ఫైర్ అవుతున్నారు. దీంతో కొత్త అభ్యర్థిని ప్రకటించినా ఎక్కడా సందడి వాతావరణం లేకుండా నిశ్శబ్దం అలుముకుని, కేడర్ నైరాశ్యంలోకి వెళ్ళిపోయింది. అభ్యర్థి మార్పుతో కీలక పెద్దనేత తీరుపై నిరసన స్వరం సర్వత్రా వ్యక్తమవుతోంది.పెద్దిరెడ్డిని ధిక్కరించిన ఆదిమూలం దిష్టిబొమ్మలు కాల్చి, తమ అభ్యర్థి గురుమూర్తేనని, అప్పుడే గెలిచి పోయినట్లు రెండు రోజులుగా నేతలు సంబరాలు కూడా చేసుకున్నారు. బుధవారం రాత్రి వరకు ధీమాగా ఉన్న వైసీపీ నాయకులు కొత్త అభ్యర్థి ప్రకటనతో దీనంగా మౌనందాల్చారు. దీంతో నియోజకవర్గంలో పార్టీ ఒక్కసారిగా డీలా పడిపోయింది. ఆదిమూలం దెబ్బతో నియోజకవర్గంలో మలుపులు తిరుగుతున్న రాజకీయం సర్వత్రా ఆసక్తికరంగా ఉంది.

దళిత వర్గాల్లో పెరుగుతున్న సానుభూతి

పెద్దిరెడ్డిని విభేదించి పార్టీని వీడిన ఆదిమూలంపై వైసీపీలోని ప్రధాన సామాజిక వర్గం చేసిన అమానుష వైఖరి పట్ల దళితవర్గాల్లో ఆయనకు సానుభూతి పెరుగుతోంది. పెద్దిరెడ్డిపై ఆదిమూలం చేసిన విమర్శలను జీర్ణించుకోలేని ప్రధాన సామాజిక వర్గ నేతలు ఆయన దిష్టిబొమ్మలను కాల్చ డం, పార్టీకి పట్టిన శని పోయిందని వ్యాఖ్యలు చేయడం పట్ల దళిత సామాజికవర్గంలో ఆదిమూలంపై అమాంతం సానుభూతి పెరిగింది. ఈ పరిణామాలతో ఎమ్మెల్యే వర్గీయులతో పాటు పలువురు పార్టీ నేతలు కూడా ఆదిమూలంతో టచ్‌లోకి వెళ్ళిపోయినట్లు సమాచారం.ఎమ్మెల్యే సైతం గుట్టుచప్పుడు కాకుండా తన సామాజిక వర్గం మద్దతు కూడగట్టుకుంటున్నట్లు సమాచారం. ఇదే జరిగితే నియోజకవర్గంలో సగం వైసీపీ ఖాళీ అవుతుందని చర్చించుకుంటున్నారు.



తిరుమలలో రేపటి నుంచి ధార్మిక సదస్సు

తిరుమల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం నుంచి సనాతన ధార్మిక సదస్సు ప్రారంభం కానుంది. హిందూ ధర్మప్రచారం, పరిరక్షణ నిమిత్తం టీటీడీ ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు తిరుమలలోని ఆస్థానమండపంలో సనాతన ధార్మిక సదస్సు నిర్వహించబోతోంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న 57 మంది పీఠాధి, మఠాధిపతులను, ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధులను టీటీడీ ఇప్పటికే ఆహ్వానించింది. హిందూ ధర్మప్రచారం, పరిరక్షణ, సనాతన హిందూ ధర్మవిలువల వ్యాప్తి పరచడంతో పాటు విశిష్టతను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలు, సలహాలపై సదస్సులో చర్చించనున్నారు. పీఠాధి, మఠాధిపతులకు తగిన ఏర్పాట్లు చేసేందుకు ముగ్గురు సీనియర్ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. ఒకో స్వామిజీకి ఒక లైజన్ అధికారిని నియమించారు. దర్శనం, వసతి, ఆహారం, రవాణా వంటి కమిటీలతో లైజన్ అధికారి సమన్వయం చేసుకుని స్వామిజీలకు తగిన ఏర్పాట్లు చేస్తారు.

సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో జిల్లా ప్రాజెక్టులకు గుర్తింపు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 1: సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో జిల్లాకు చెందిన మూడు ప్రాజెక్టులకు గుర్తింపు లభించింది. టీచర్ల విభాగంలో మై క్యారియర్ బ్యాడ్ ఫర్ బ్యాడ్ హిడన్ పేషంట్స్. విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో ఉమన్ సేఫ్టీ డిజైజ్ విత్ జీపీఎస్ లోకేషన్.. విద్యార్థుల గ్రూపు విభాగంలో ఇరిగేటెడ్ ఫార్మింగ్ ప్రాజెక్టులు ఎంపికైనట్లు డీఈవో విజయేంద్రరావు, జిల్లా సైన్స్ అధికారి రమణ తెలిపారు. ఈ విద్యార్థులతో పాటు టీచర్లకు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. గత నెల 27 నుంచి విజయవాడలో నిర్వహించిన సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ గురువారంతో ముగిసింది.



విద్యార్థినులు, గైడ్ టీచర్లకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి

టీడీపీ బీసీలకు పుట్టినిల్లులాంటిది


బీసీ సదస్సులో సంఘీభావం తెలుపుతున్న బీసీ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 1: రాజకీయ చిత్రపటంలో బీసీ వర్గాలకు టీడీపీ పుట్టినిల్లు లాంటిదని తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార కమిటీ రాష్ట్ర కార్యదర్శి పురం రామ్మూర్తి పేర్కొన్నారు. పీలేరులోని టీడీపీ కార్యాలయంలో గురువారం పీలేరు నియోజకవర్గస్థాయి జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావానికి ముందు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు రాజకీయ అధికారానికి దూరంగా ఉండేవారన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కాదని, సమాజానికి బ్యాక్ బోన్ క్లాసెస్ అని నినదించిన స్వర్గీయ ఎన్టీఆర్ అందుకు అనుగుణంగా రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించిన చంద్రబాబు నాయుడు రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి అనేక మంది బీసీలను తిరుగులేని రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దారన్నారు. అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉపాధి రంగాల్లో అభివృద్ధికి బాటలు వేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడిపోయారన్నారు. కార్పొరేషన్లు ఫుల్, నిధులు నిల్ కావడంతో గడిచిన నాలుగున్నరేళ్ల పాలనలో బీసీలకు ఎటువంటి మేలు జరగలేదన్నారు. అన్నమయ్య జిల్లా టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తేవడమే కాకుండా రాష్ట్రంలోని వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పెత్తందారీ మనస్తత్వం కలిగిన వైసీపీని ఓడించి సామాజిక న్యాయం పాటించే టీడీపీని గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. జనసేన పార్టీ నాయకుడు మోహనకృష్ణ మాట్లాడుతూ జగన్ పాలనలో వడ్డెరలు, మత్స్యకారులు, కురబలు, మంగళి వంటి అనే కులాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారని, అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తున్న టీడీపీ, జనసేనలను గెలిపించాలని కోరారు. అనంతరం వచ్చే ఎన్నికల్లో బీసీలందరూ సంఘటితంగా ఉంటూ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని సదస్సులో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు వసంతాల రాజా, జనార్దన్ గౌడ్, పసుపులేటి లక్ష్మీకర, పోలిశెట్టి సురేంద్ర, త్యాగరాజు, మల్లెల రెడ్డిబాషా, ఆబిద్, స్పోర్ట్స్ మల్లి, అప్పస్వామి, జ్ఞానమూర్తి, వేణుగోపాల్, పురం రెడ్డమ్మ, సాధన, రమాదేవి, మీనా, లక్ష్మీకాంతమ్మ, రెడ్డిముని, ఆంజి, జనసేన నాయకుడు గజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు

- పట్టపగలే రెచ్చిపోతున్న ఆగంతకులు
- పోలీసుల నిఘా పెంచాలంటున్న జనం


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న లక్ష్మీదేవి, బంధువులు

గుర్రంకొండ, ఫిబ్రవరి 1:స్వగ్రామానికి వెళ్లడానికి బస్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న లక్ష్మీదేవి(55) అనే మహిళపై దుండగులు దాడి చేసి మెడలోని బంగారు గొలుసును పట్టపగలే లాక్కెళ్లిన సంఘటన గురువారం ఎగువఅమిలేపల్లె క్రాస్ వద్ద జరిగింది. బాధితురాలి కథనం మేరకు మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన రంగప్ప, లక్ష్మీదేవిల కుమార్తె నరసలతను గుర్రంకొండ మండలం అమిలేపల్లె పంచాయితీ ఎగువఅమిలేపల్లెకు చెందిన సిద్దనారాయణకు ఇచ్చి వివాహం చేశారు. ఈ క్రమంలో బాధితురాలు రెండు రోజుల క్రితం సీటీఎం నుంచి కుమార్తెను చూడడానికి అమిలేపల్లెకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్లడానికి బయలుదేరింది. ఈ నేపథ్యంలో ఉదయం 11 గంటలకు గుర్రంకొండ-వాల్మీకీపురం రోడ్డు మార్గంలోని ఎగువ అమిలేపల్లె క్రాస్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తుండగా గుర్రంకొండ నుంచి తరిగొండ వైపు ద్విచక్ర వాహనంలో వెళుతున్న ఇద్దరు దుండగులు మహిళపై దాడి చేసి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఈ ఘటనలో మహిళ దుండగులను ప్రతిఘటించిన ఆమెను తోసేసి 43 గ్రాములు బరువు గల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బంగారు గొలుసు విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. దీంతో పక్కనే పొలంలో ఉన్న బంధువులు గమనించి విషయాన్ని తెలుసుకునే లోపే దుండగులు పారిపోయారు. దీంతో బాధితురాలు తనకు జరిగిన అన్యాయాన్ని గుర్రంకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చైన్ స్నాచింగ్‌లతో ఆందోళనలో ప్రజలు

గుర్రంకొండ మండలంలో చైన్‌స్నాచింగ్‌ల ముఠా సభ్యులు మహిళలనే టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో బస్టాప్‌లు, జన సంచారం లేని వీధుల్లో తిరిగే మహిళపై రెక్కీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే పట్టణంలోని తాళం వీధి, బజారు వీధి, కొత్తపేట, ఎగువఅమిలేపల్లె క్రాస్, తరిగొండ, మర్రిపాడు గ్రామాల్లో చైన్ స్నాచింగ్ ముఠా సభ్యులు ద్విచక్ర వాహనాల్లో వచ్చి మహిళల మెడలోని బంగారు గొలుసులను లాక్కెళ్లిన సంఘటనలున్నాయి. చైన్‌స్నాచర్లు పట్టపగలే చోరీలకు పాల్పడుతుండడంతో ప్రజలు, మహిళలు, పిల్లలు భయభ్రాంతులు చెందుతున్నారు. ఇప్పటికైన పోలీసులు ప్రత్యేక నిఘా పెంచి చైన్ స్నాచింగ్‌లను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 1: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ టోపిసాబ్ (25)అనే యువకుడు మృతి చెందినట్లు పెద్దమండ్యం పోలీసులు వెల్లడించారు. పెద్దమండ్యం మండలం పాపేపల్లి గ్రామ పంచాయతీ గురివిరెడ్డిగారిపల్లి కు చెందిన టోపిసాబ్ అతని స్నేహితుడు షంషుద్దీన్‌తో కలిసి స్వంత పనులపై ద్విచక్రవాహనంలో మండలంలోని కలిచెర్లకు వెళ్లి వస్తుండగా బండమీదపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లి కు చెందిన నసీమ్ (25) ద్విచక్రవాహనంలో వస్తుండగా కలిచెర్ల వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురుఎదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయమైన టోపిసాబ్‌ను తిరుపతికి రెఫర్ చేయగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఈ సంఘటన గత నెల 28వ తేది సాయంత్రం జరిగింది. శవపరీక్షల నిమిత్తం టోపిసాబ్ మృతదేహాన్ని మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసును మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిల్లర కోసం వ్యాపారిపై అన్నదమ్ముల దాడి

- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యాపారి మృతి
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

మదనపల్లె, ఫిబ్రవరి 1: చిల్లర విషయంలో తలెత్తిన ఘర్షణలో దుకాణ వ్యాపారిపై అన్నదమ్ములు కర్రలు, రాళ్లతో దాడి చేయగా..ఆ వ్యాపారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ హత్య కేసులో నిందితులుగా ఉన్న అన్నదమ్ములను గురువారం మదనపల్లె తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల అరెస్టుకు సంబంధించి తాలూకా సీఐ ఎన్ శేఖర్, ఎస్‌ఐలు రవి కుమార్, మోహన్‌నాయక్‌లు తెలిపిన వివరాల మేరకు...మదనపల్లె మండలం కొత్తఇండ్లు పంచాయతీ మున్సిపల్ పార్కు సమీపంలోని భవానీ నగర్‌కు చెందిన సయ్యద్ చాంద్‌బాష(68) చిల్లర దుకాణం నడుపుతున్నాడు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన అన్నదమ్ములు షబ్బీర్, షాజహాన్ ఈ నెల 22న సరుకులు కొనుగోలు చేయడానికి ఆ దుకాణానికి వెళ్లి చిల్లర విషయంలో వ్యాపారిపై గొడవకు దిగి కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన వ్యాపారిని కుటుంబసభ్యులు చికిత్స కోసం రుయాకు తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో జనవరి 27న మృతి చెందాడు. ఈ ఘటనపై తొలుత దాడి కేసుగా నమోదు చేసిన పోలీసులు వ్యాపారి మృతి అనంతరం హత్య కేసుగా నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా బసినికొండలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి అరెస్టు చేసినట్లు తెలిపారు.

రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యం

- తంబళ్లపల్లె టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి
- రైతు నాగరాజుకు ఆర్థిక సాయం అందజేత


నాగరాజుకు ఆర్థిక సహాయం అందిస్తున్న జయచంద్రారెడ్డి

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 1 : రాబోయే తంబళ్లపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం పీటీఎం మండలం తుమ్మరకుంటతో పాటు పలు గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో టీడీపీ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి తంబళ్లపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవడంతోపాటు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. మొదటగా తుమ్మరకుంట గ్రామం గజ్జలవారిపల్లెలో పర్యటించి టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. అనంతరం గజ్జలవారిపల్లె గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై అవయవాలు దెబ్బతిని మంచానికే పరిమితమైన నాగరాజు అనే రైతు విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు గంగిరెడ్డి, బయ్యారెడ్డిలు జయచంద్రారెడ్డి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన్న నాగరాజు ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ ఖర్చుల నిమిత్తం ఆయనకు రూ. 10 వేలు ఆర్థిక సహాయంగా అందించారు. ఇంకా మండలంలో ఇటువంటి కుటుంబాలు ఎవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానిక నాయకులను కోరారు.ఆయన వెంట టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు బీవీ రెడ్డి, పట్టా చంద్రమోహన్‌రెడ్డి, వార్డు నెంబర్ అనంతాపురం సుబ్బిరెడ్డి, తుమ్మరకుంట గ్రామ కమిటీ అధ్యక్షుడు గంగిరెడ్డి, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి ఆంజనేయ రెడ్డి, నవాబుకోట మంజునాథ్, బయ్యారెడ్డి, వెంకటరెడ్డి, అంకిరెడ్డిపల్లె రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటప్ప(చిన్నా), తాడిగోళ్లపల్లె సుధాకర్‌రెడ్డి, వరికసువుపల్లె ఆంజనేయరెడ్డి, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఆశ్రమానికి బియ్యం ప్యాకెట్లు వితరణ



మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 1: మండలంలోని కోళ్లబైలు పంచాయతీ, అమ్మచెరువుమిట్టలోని వెలుగు ఆశ్రమానికి గురువారం దాతలు బియ్యం ప్యాకెట్లు వితరణగా అందజేశారు. టూటౌన్ పోలీసు స్టేషన్ రైటర్ రామమూర్తి, ఏపీ రాష్ట్రమ వాళా పోలీస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నందిని సహకారంతో స్థానిక ఎస్వీఆర్ లేవుట్ వాసులు తేజ, దిలీప్, మాత్యూస్ కలిసి ఐదు బియ్యం ప్యాకెట్లును వితరణ చేశారు. కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జట్టుకు మిట్స్ విద్యార్థులు

కురబలకోట, ఫిబ్రవరి 1: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు జేఎన్‌టీయూ హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో బాలికల విభాగంలో సీఎస్ఈ ఫైనలియర్‌కు చెందిన శృతి, దీక్షితాలు పులివెందుల జేఎన్‌టీయూలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు తమిళనాడులోని సేలంలోని పెరియార్ యూనివర్సిటీలో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరిచిన ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఈడీ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, పీడీ దామోదరన్ అభినందించారు.

నేడు జయహో బీసీ కార్యక్రమం

ములకలచెరువు, ఫిబ్రవరి 1: ములకలచెరువులో శుక్రవారం తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జి.శంకర్‌యాదవ్ అధ్యక్షతన జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్దా పేర్కొన్నారు. ములకలచెరువులో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలుత స్థానిక బస్టాండు సర్కిల్ నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలతో కేజీఎన్ కళ్యాణమండపం వరకు మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం జయహో బీసీ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, బీసీలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

ఎంపీడీవో, తహసీల్దార్లు బదిలీ

కలికిరి, ఫిబ్రవరి 1: ఎన్నికల కమిషన్ నియమావళి మేరకు కలికిరి ఎంపీడీవో గంగయ్య, తహసీల్దారు భాగ్యలత బదిలీ అయ్యారు. ఎంపీడీవో గంగయ్యను నెల్లూరు జిల్లాకు, తహసీల్దారు భాగ్యలతను సత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు. కాగా ఎంపీడీవోను రాపూరు ఎంపీడీవోగా నియమిం చారు.

నిమ్మనపల్లి ఎస్ఐగా లోకేష్‌రెడ్డి

నిమ్మనపల్లి, జనవరి 1: నిమ్మనపల్లి మండల ఎస్ఐగా లోకేష్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తంబళ్లపల్లి మండలంలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై నిమ్మనపల్లి ఎస్ఐగా నియమితులై బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఇన్‌చార్జి ఎస్ఐ తిప్పేస్వామి ములకలచెరువుకుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ లోకేష్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అలాగే నాటుసారా, పేకాట, కోడిపందేలను అరికట్టనున్నట్లు తెలిపారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జన్మదిన వేడుకలు


మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న సేతు, విద్యాసాగర్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 1: మదనపల్లె టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో షాజహాన్‌బాషా అనుచరులు రెండు భారీ కేకులు తెప్పించి షాజహాన్‌బాషా చేతుల మీదుగా కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. జనసేన రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి, టీడీపీ సీనియర్ నేత మార్పూరి సుధాకర్‌నాయుడు, విజయభారతి హైస్కూల్ కరస్పాండెంట్ ఎన్.సేతు, టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, నాదెళ్ల శివన్న, ఆర్‌జే వెంకటేష్, బాలుస్వామి, నవీన్‌చౌదరి, షంషీర్, నాగూర్‌వలి తదితరులు గజమాలతో, పుష్పగుచ్ఛాలతో షాజహాన్‌బాషాకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు, నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి టీడీపీ నాయకులు వచ్చి షాజహాన్‌బాషాకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కూరపర్తి అనాథాశ్రమంలో చిన్నారులకు అన్నదానం చేశారు.

జిల్లాకు 45 కొత్త బస్సులు మంజూరు


పీలేరులో అధికారులతో మాట్లాడుతున్న డీపీటీవో రాము

పీలేరు, ఫిబ్రవరి 1: అన్నమయ్య జిల్లాకు ఈనెల 15వ తేదీలోపు 45 కొత్త బస్సులు రానున్నట్లు డీపీటీవో రాము తెలిపారు. పీలేరు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలోని ఖాళీ ప్రదేశాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు రానున్న కొత్త బస్సుల్లో అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. కొత్త వాటిలో పీలేరు డిపోకు నాలుగు కేటాయించనున్నట్లు వెల్లడించారు. పీలేరు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో సుమారు 15 ఎకరాల భూమి ఖాళీగా ఉన్నదని, 5, 15 సంవత్సరాల లీజు పద్ధతిలో ఆసక్తి గల వారికి అద్దెకివ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో గత ఏడాది కంటే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గాయని, రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక కౌన్సెలింగ్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం బండ్లకుమార్, సీఐ సుబ్బన్న, బస్-స్టేషన్ మేనేజర్ రెడ్డప్ప, ఏడీసీలు హనీఫ్, బాబు నాయక్, యూనియన్ నాయకులు పీఎస్ఎం రాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

గిఫ్ట్‌స్కీంలో విజేతలకు బహుమతులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 1: ఆర్టీసీ వన్ డిపో ఆధ్వర్యంలో బస్టాండ్‌లో గురువారం గిఫ్ట్‌స్కీం విజేతలను డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణాప్రాంతాల్లో ఆర్టీసీని ఆకుట్టుకోవడానికి గిఫ్ట్‌స్కీం ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రథమ బహుమతి మెగసాలమర్రి నందిని, ద్వితీయ బహుమతి బి.కొత్తకోటకు చెందిన ఓలేటి శ్రీరాములు, తృతీయబహుమతి బి.కొత్తకోటకు చెందిన రంజిత్‌కు డిపో మేనేజరు బహుమతులు అందజేశారు. అలాగే ఫిబ్రవరి మాసంలో మదనపల్లె- తంబళ్లపల్లె మార్గంలో 27వ తేదీన లక్కీ డ్రా తీయనున్నట్లు చెప్పారు. జనవరి మాసంలో మదనపల్లె ఆర్టీసీ వన్‌డిపో ఓఆర్ 70 శాతం, కేఎంపీఎల్ 5.44 సాధించి రీజియన్‌లోనే మొదటి స్థానంలో నిలిచామని ఉద్యోగులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. అసిస్టెంట్ మేనేజరు రేవతి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు ఆసుపత్రి ల్యాబ్ తనిఖీ

పీలేరు, ఫిబ్రవరి 1: పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలోని ల్యాబ్‌ను గురువారం జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ల్యాబ్ సిబ్బందితో మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల నిర్ధారణలో ప్రత్యేక చొరవ తీసుకుని మలేరియా, డెంగ్యూ నిర్మూలనకు తోడ్పాటునందించాలన్నారు. అనంతరం ఆయన ల్యాబ్ రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్-యూనిట్ అధికారి విద్యాసాగర్, ల్యాబ్ టెక్నీషియన్లు మల్లిఖార్జున, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో ఇంటిగ్రేటెడ్ శిక్షణ

బి.కొత్తకోట ఫిబ్రవరి 1 : బి.కొత్తకోట నగర పంచాయతీలో తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ శంకర్‌యాదవ్ ఆదేశాను సారం బి.కొత్తకోటలోని క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ఐటీడీపీ ఉపాధ్యక్షుడు కుమార్, పోల్ కోఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, మండల కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, టౌన్ కన్వీనర్ బంగారు వెంకట్రమణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ కనకంటి ప్రసాద్, కుమార్, మాజీ ఉప సర్పంచ్ షమీవుల్లా, బీరంగి ఆనంద్, శ్రీనాథ్, కుడుం శరత్‌లతో పాటు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసింహులు సేవలు అభినందనీయం

నిమ్మనపల్లి, జనవరి 1: మండల విద్యాశాఖలో ఎంఐఎస్ కోఆర్డినేటర్‌గా పని చేస్తున్న నరసింహులు సేవలు అభినందనీయమని ఎంఈవో-1 పద్మావతి, ఎంఈవో-2 నారాయణ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న సందర్భంగా గురువారం ఘనంగా పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సుజాత, మాధవి, ఎమ్మార్సీ సిబ్బంది ఐఈఆర్‌టీలు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పేరుతో నిరుద్యోగులకు మెగా దగా

జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన రాయలసీమ కో-కన్వీనర్ రామ్‌దాస్‌చౌదరి

మదనపల్లె, ఫిబ్రవరి 1:డీఎస్సీ పేరుతో వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేస్తోందని జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి విమర్శించారు. స్థానిక కమ్మవీధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసైనికులు, వీరమహిళలతో కలసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌దాస్‌చౌదరి మట్లాడుతూ ఎన్నికల ముందు మెగా డీఎస్సీ అని చెప్పిన ప్రభుత్వం ఇన్నాళ్లూ కాలాయపన చేసి, తీరా ఎన్నికల సమయం వచ్చేసరికి సీఎం జగన్‌కు నిరుద్యోగులు గుర్తొచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో మరోసారి మోసం చేయడానికి మెగా డీఎస్సీపేరుతో మెగా దగా చేయడానికి సిద్ధమయ్యాడని దీన్ని నిరుద్యోగులు గమనించాలని కోరారు. రాష్ట్రంలో 21వేల టీచర్ పోస్టులు ఖాళీలు ఉంటే కేవలం 6,100తో మమ అనిపిస్తున్నారని. ఇది నిరుద్యోగులు, ప్రజలను మోసం చేయడం కాదా? అంటూ ప్రశ్నించారు. బీటీ కళాశాలను ప్రభుత్వ పరం చేశామని జీవో కూడా వెంటనే వచ్చేస్తుందని, యూనివర్సిటీ కూడా చేశామని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి కూడా ప్రజలను మరోసారి మోసం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు రామ్‌దాస్‌చౌదరి ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్, జిల్లా జాయింట్ సెక్రటరీ సునావుల్లా, గజ్జల రెడ్డెప్ప, రూరల్ అధ్యక్షుడు గ్రానైట్ బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి రెడ్డెమ్మ, సెక్రటరీ నాగవేణి, సరోజ, స్వాతి, లవన్న, కుమార్, గడ్డం లక్ష్మీపతి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, రాజారెడ్డి, వినయ్‌కుమార్, గంగులప్ప, జనార్దన్ పాల్గొన్నారు.

జనసేన పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది


జనసేన నేత శ్రీరామ రామాంజనేయులుతో సీటీఎం రైతులు

మదనపల్లె, ఫిబ్రవరి 1: జనసేనకు, పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని, అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా ముందుకొస్తుండడమే ఇందుకు నిదర్శనమని జనసేన నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు పేర్కొన్నారు. మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన కొందరు రైతులు, ప్రజలు స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం శ్రీరామ రామాంజనేయులును. కలసి జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి విజయానికి తామంతా కృషి చేస్తామని స్పష్టం చేశారు. జనసేన సిద్ధాంతాలు, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై పార్టీకి అండగా నిలుస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు సహకరించి జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఇందులో జనసైనికులు గంగాధర్, శెట్టి రాజా, బాలాజీ, శెట్టి శ్రీనివాసులు, కోసూరి వేమన్న, నాగరాజు, రామచంద్ర, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

హిట్లర్ పాలనను తలపిస్తోన్న జగన్ సర్కారు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 1: జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం హిట్లర్ నియంత పాలనను తలపిస్తోందని పీలేరుకు చెందిన ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. పీలేరులోని సీపీఐ కార్యాలయంలో గురువారం సీపీఐ నాయకుడు టీఎల్ వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు అమృతతేజ, శ్రీకాంత్, డీబీఎస్ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భానుప్రకాశ్, జనసేన నాయకుడు పవన్ కుమార్ విలేఖరులతో మాట్లాడారు. మదనపల్లె జిల్లా ఏర్పాటు చేయాలని తాము 2002, ఫిబ్రవరి 1న పీలేరులో శాంతియుతంగా ఇతర ప్రజాసంఘాలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. అప్పటి నుంచి దాని గురించి పట్టించుకోని ప్రభుత్వం, పోలీసులు గురువారం తమ మీద అక్రమంగా కేసు నమోదు చేశారన్నారు. ప్రజల ఆకాంక్షలు, కోరికలను సైతం బహిర్గతం చేయనీయకుండా వైసీపీ ప్రభుత్వం పోలీసుల ద్వారా అక్రమ కేసులతో వేధిస్తోందని వారు వాపోయారు. ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం శోచనీయమన్నారు.

ఆశా వర్కర్లకు వెంటనే వేతనాలు పెంచాలి



డిప్యూటి డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 1: రాష్ట్రంలో ఆశా వర్కర్ల వేతనాలను వెంటనే పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఆశా వర్కర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, చిన్నారులు, ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఆశా వర్కర్లు గౌరవ వేతనంతోనే పనిచేస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రభుత్వం ఇచ్చే వేతనాలతో జీవనం కష్టంగా ఉందన్నారు. జనాభా ప్రాతిపదికన ఆశా వర్కర్లకు విధులు కేటాయించాలన్నారు. పని ఒత్తిడి పెంచారే కాని ఆశా వర్కర్లకు సెలవులు మంజూరు చేయడం లేదన్నారు. ఆశా వర్కర్లకు పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమల, ఆశా వర్కర్లు కల్పన, కుమారి, శైలజ, రేఖా. విమలాంజన, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోసం 4న 'విశాఖ దీక్ష'



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏపీసీపీఎస్ఈఏ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 1: సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న విశాఖలో 'ఓట్ ఫర్ ఓపీఎస్, సాగర సంగ్రామం' పేరుతో నిరసన దీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీ ఎస్ఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ తెలిపారు. పీలేరులోని ఏపీసీపీఎస్ఈఏ కార్యాలయంలో గురువారం ఆయన విశాఖ సభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కేవలం వారం రోజుల్లో సీపీ ఎస్‌ను రద్దు చేస్తానని హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నన్నాళ్లూ దాని గురించి పట్టించుకోలేదన్నారు. అనేకమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. పైపెచ్చు ఉద్యోగులకు ఆర్థికంగా నష్టం చేకూర్చే జీపీఎస్ విధానాన్ని తీసుకువచ్చారన్నారు. తమ డిమాండ్‌ను పరిష్కరించకుండా మళ్లీ ఎన్నికలకు వెళుతున్న జగన్‌కు వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 3.5 లక్షల సీపీఎస్ ఉద్యోగులు తగిన గుణపాఠం నేర్పాలన్నారు. అందులో భాగంగా ఉద్యోగులను సమాయత్తం చేసేందుకు విశాఖలో సభ ఏర్పాటు చేశామని, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని సీపీఎస్ ఉద్యోగులు పెద్దఎత్తున తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రెడ్డి రమేశ్, ఏపీసీపీఎస్ఈఏ నాయకులు ఆంజనేయులు, జయప్రకాశ్, కిశోర్, వినోద్, ఈశ్వరయ్య, పోతంశెట్టి రమేశ్, వేణు, జనార్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విశ్వం ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు

కురబలకోట, ఫిబ్రవరి 1: మండలంలోని అంగళ్లు సమీపంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు దక్కినట్లు కళాశాల ఛైర్మన్ ఎం.ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమణారెడ్డిలు పేర్కొన్నారు. కాగా గతేడాది కళాశాలకు నాక్ గుర్తింపు దక్కగా ఈ ఏడాది అటానమస్ గుర్తింపు దక్కింది. గత రెండు నెలల క్రితం అటానమస్ బృందం కళాశాలలో పర్యటించి తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాప్రమాణాలు, తరగతి గదులు, ల్యాబ్‌లు, లైబ్రరీ, క్రీడామైదానం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, హాస్టల్ రవాణా సదుపాయాలను అడిగి తెలుసుకుని నివేదికను అందజేశారు. అటానమస్ బృందం సంతృప్తిని వ్యక్తం చేయడంతో కళాశాలకు ఈ గుర్తింపు లభించిందన్నారు. కళాశాలకు అటానమస్ గుర్తింపు రావడంతో కళాశాల ఛైర్మన్, ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు హర్షం వ్యక్తం చేశారు..

బదిలీపై వెళ్లిన ఎంపీడీవో శేషాద్రికి సన్మానం



నిమ్మనపల్లి, జనవరి 1: మండలంలో పని చేస్తున్న ఎంపీడీవో పేర్ని శేషాద్రి బదిలీపై వెళుతున్న సందర్భంగా ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. నెల్లూరు జిల్లా సంఘం మండలానికి. ఆయన బదిలీపై వెళ్లనున్నారు. దీంతో గురువారం సహచర ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు ఆయనకు శాలువలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ తనకు విధినిర్వహణలో అన్ని విధాల సహకరించిన ఉద్యోగులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.